హైదరాబాద్ వార్త



రామ రామ... ఇదేమి శ్రమ?

-మదీనాగూడ రామక్రిష్ణనగర్‌కు రాకపోకలు బంద్..
-అధికారుల తప్పిదానికి ప్రజల హరిగోస
-10వేల జనాభా ఉన్న కాలనీ పరిస్థితి అగమ్యగోచరం

కాలనీ ప్రధాన రహదారిని తవ్వి వదిలేసిన ద ృశ్యం

కాలనీకి వచ్చే మరో రహదారిపై కొనసాగుతున్న వారసంత

సైబరాబాద్ ప్రతినిధి, మార్చి 23 ప్రభాతవార్త అధికారులు చేసిన తప్పుకు ప్రజలు బలవుతున్నారు.. హైటెక్ నియోజకవర్గంలోని జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న కాలనీకి వెళ్లేందుకు రహదారి లేక నెలన్నరగా ప్రజలు నరకం అనుభవిస్తున్నారు. ప్యాచ్‌వర్క్ చేయమంచే రోడ్డు తవ్వి వదిలేసిన అధికారులే సమస్యలకు కారణం కాగా, సరిదిద్దాల్సిన నాయకులు సైతం పంతాలకు పోవడంతో 10వేల జనాభా ఉన్న కాలనీకి నెలన్నరగా రాకపోకలు నిలిచిపోయాయి. ప్యాచ్‌వర్క్ చేయాల్సిన సిసి రోడ్డును మొత్తం తవ్వి నెలన్నరగా నిర్లక్ష్యంగా వదిలివేయడంతో మధీనగూడ రామక్రిష్ణనగర్‌కు రాకపోకలు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి పరిస్థితి ఈ విధంగా ఉంటే చుట్టూ తిరిగి వెళ్దామంటే వార సంతతో ఉన్న కొద్దిపాటి రహదారి సైతం మూసుకుపోతుంది. దీంతో జాతీయ రహదారి నుంచి కాలనీకి వచ్చేందుకు, కాలనీ నుంచి బయటకు వెళ్లేందుకు వాహనాలు అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మియాపూర్ సర్కిల్ మధీనగూడ రామక్రిష్ణనగర్ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారిని గత నెలన్నర క్రితం ఇంజనీరింగ్ విభాగం అధికారులు పూర్తిగా తవ్వారు. కాలనీ లోపలికి వెళ్లే ప్రధాన రహదారి సిసి రోడ్డును దాదాపు 200 మీటర్ల పొడవునా తవ్వి వదిలేశారు. రోడ్డంతా సక్రమంగా ఉన్నా ఎందుకు తవ్వకాలు చేపట్టారని విచారిస్తే నీళ్ల నిలిచిన ప్రాంతంలో ప్యాచ్‌వర్క్ చేయాల్సిన చోట పొరపాటున రోడ్డును మొత్తం తవ్వినట్లు గుర్తించారు. దీంతో నాలుక్కరుచుకున్న అధికారులు తిరిగి రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు వర్క్ అర్డర్ సైతం లేకపోవడంతో సిసి రోడ్డు శిథిలాలను తొలగించకుండా ప్రమాదకరంగా వదిలేశారు. కాలనీ వాసులు పలుమార్లు పిర్యాదు చేయడంతో ఎట్టకేలకు అధికారులు సిసి రోడ్డు శిథిలాలను పది రోజుల క్రితం ఎత్తివేశారు. దీంతో రోడ్డు మొత్తం పెద్ద గుంతగా మారడంతో ఇరువైపులా శిథిలాలతో రోడ్డును మూసి వేశారు. అప్పటి నుంచి రోడ్డును తిరిగి నిర్మించేందుకు చర్యలు తీసుకోకుండా వదిలిపెట్టారు. దీంతో కాలనీ వాసులు చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఆదివారం సంతతో అష్టదిగ్బంధం...

కాగా కాలనీకి వచ్చేందుకు రెండే రహదారులు ఉండగా, ఒక రహదారిని అధికారులు తవ్వి వదిలేయగా... మరో రహదారి ఆదివారం వార సంత నిర్వహణతో మూసుకుపోతుంది. దీంతో ఆదివారం వచ్చిందంటే కాలనీకి రాకపోకలు నిలిచిపోయి అష్టదిగ్బంధమవుతుంది. రామక్రిష్ణనగర్ కాలనీకి వచ్చే ప్రధాన రహదారి అయిన మజీద్ రోడ్డును అధికారులు తవ్వి వదిలేయగా, రెండో మార్గం ప్రణామ్ ఆసుపత్రి రహదారిపై ఆదివారం వార సంత కొనసాగుతుంది. దీంతో ఆదివారం కాలనీకి రాకపోకలు నిలిచిపోతుండగా, కాలనీ వాసులు తమ వాహనాలను జాతీయ రహదారి మీద నిలిపి కాలనీలోకి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. అసలే కాలనీకి వచ్చేందుకు రహదారి లేక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే జాతీయ రహదారి మీద చేపట్టిన తవ్వకాలు మూలిగే నక్క మీద తాటిపండు పడిన చందంగా మారాయి.

పెనం మీద నుంచి పొయ్యిలోకి...

నెలన్నర క్రితం హడావిడిగా సిసి రోడ్డును మొత్తం తవ్వేసిన అధికారులు రోజుల తరబడి పట్టించుకోకుండా వదిలేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గతంలో కనీసం అటు నుంచి ఇటు వాహనాలు వెళ్లే పరిస్థితి ఉండేది. కానీ పది రోజుల క్రితం సిసి రోడ్డు శిథిలాలను అధికారులు తొలగించడంతో రహదారికి ఇరువైపులా భారీ గోతులు ఏర్పడ్డాయి. మద్యలో ఉన్న డ్రైనేజీ కాలువ పైకప్పు మీద ఐదు ఫీట్ల రహదారి ఉండడంతో ఈ దారిలో వచ్చి ఇరుక్కుపోతున్న వాహనదారులకు బయటపడేందుకు చుక్కలు కనిపిస్తున్నాయి. కాలనీ లోపల రహదారిపై శిథిలాలతో దారి మూసివేయడంతో పొరపాటున ఇందులోకి వస్తున్న వాహనదారులు వెనక్కి వెళ్లే దారి లేక గోతుల్లో పడి వాహనాలు పాడవుతున్నాయి. ఇక రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇళ్లు, అపార్టుమెంట్లలో ఉన్న కార్లు, వాహనాలు నెలన్నరగా బయటకు తీసే వీలు లేకుండా పోయింది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తవ్విన రహదారిని పునర్నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

నీటి యుద్ధాలు రాకముందే మేల్కొందాం

-జలవనరుల పరిరక్షణ అందరి బాధ్యత -హైడ్రా కమిషనర్ రంగనాథ్

సమావేశంలో మాట్లాడుతున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్ తదితరులు

హైదరాబాద్, మార్చి 23,ప్రభాతవార్త: ప్రస్తుతం ఆయిల్ కోసం యుద్ధాలు జరుగుతున్నాయని జలవనరులపై యుద్ధాల వరకూ వెళ్లకుండా జాగ్రత్త పడాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ సూచించారు. నీటి యుద్ధాలకు ఆస్కారం లేకుండా మేలుకొందామని అన్నారు. ఈమేరకు సోమవారం జేఎన్‌టీయూలో ఓపెన్ జియోస్పేషియల్ కన్సార్టియంతో కలసి ఇండియన్ సొసైటీ ఆఫ్ జియోమేటిక్స్ హైదరాబాద్ చాప్టర్ నిర్వహించిన వరల్డ్ వాటర్ డే ఉత్సవాలలో కమిషనర్ మాట్లాడారు. నగర జనాభా అనూహ్యంగా పెరుగుతోంది. 1.60 కోట్లున్న నగర జనాభా 2050 నాటికి 3 కోట్లకు దాటే అవకాశం ఉందన్నారు. ఇలా పెరుగుతున్న జనాభా అవసరాలమేరకు నగరాన్ని అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ముందు చూపుతో నగరంలోని గొలుసుకట్టు చెరువులను పునరుద్ధరించాలని నిర్ణయించిందని.. ఆ దిశగా హైడ్రా వడివడిగా అడుగులేస్తోందని చెప్పారు. మొదటి దశ 6 చెరువులో మూడు ప్రారంభమవ్వగా.. మిగతా 3 చెరువులు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. రెండోదశలో మరో 18 చెరువులను రెండో దశగా చేపట్టామని హైడ్రా కమిషనర్ చెప్పారు. కాంక్రీట్ జంగిల్‌గా మారిన నగరంలో వర్షాకాలం వరదలు.. వేసవి కాలం నీటి ఎద్దడి సర్వ సాధారణంగా మారింది. గొలుసుకట్టు చెరువుల పునరుద్ధరణతో వరదలకు చెక్ పెట్టడమే కాకుండా.. నగరంలో భూగర్భ జలాలు పెరగడానికి అవకాశం ఉంటుందన్నారు. ఎన్ ఆర్ ఎస్ సీ (నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్) డేటా ప్రకారం 1975 నుంచి 2023 లోపు నగరంలో 61 శాతం చెరువులు మాయమయ్యాయని.. మరో 15 ఏళ్లలో ఉన్నవి కూడా కనుమరుగయ్యే పరిస్థితి ఉందని హెచ్చరించిన విషయాన్ని రంగనాథ్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. 1300ల చెరువుల్లో 700ల చెరువులు మాయం అవ్వగా..ఉన్న చెరువులు 60 శాతం కబ్జాకు గరయ్యాయని అన్నారు. హైడ్రా అభివృద్ధి చేసిన చెరువులు పిక్నిక్ స్పాట్‌గా మారుతున్నాయి. హైడ్రా చర్యల వల్ల అందరికీ చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ అంటే తెలిసింది. ఇప్పుడు రియల్టర్లు చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ పరిధిలో ఇళ్లు నిర్మించడంలేదు. ప్రజలు కొనడానికి ముందుకు రావడంలేదు. హైడ్రా చర్యలతోనే ఇది సాధ్యమైందన్నారు.

ఈ సందర్భంగా జేఎన్‌టీయూ విసి టి. కిషన్ కుమార్ రెడ్డి ప్రిన్సిపాల్ ప్రొ. జీవీ నరసింహారెడ్డి, డా. కె. మృత్యుంజయ రెడ్డి, ప్రొఫెసర్లు టి. విజయ లక్ష్మి, వి. హిమబిందు పాల్గొన్నారు.

శ్రీరామ నవమి శోభాయాత్రకు డ్రోన్లు, సిసి కెమేరాలతో నిఘా

-3వేల మంది పోలీసుల బందోబస్తు

శోభాయాత్ర వెళ్లే రూట్‌ను జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌తో కలిసి పరిశీలిస్తున్న సీపీ సజ్జనర్, చిత్రంలో అడిషనల్ సీపీ తఫ్సీర్ ఇక్బాల్ తదితరులు

హైదరాబాద్, మార్చి 23 ప్రభాతవార్త

నగరంలో శ్రీరామనవమి శోభాయాత్రను అత్యంత వైభవంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు సిద్ధమయ్యాయి. సీతారాంబాగ్ లోని ద్రౌపది గార్డెన్స్‌లో సోమవారం నిర్వహించిన అధికారుల సమన్వయ సమావేశంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌తో కలిసి నగర పోలీస్ కమిషనం వీసీ సజ్జనర్ పాల్గొన్నారు. శోభాయాత్ర ఏర్పాట్లు, తీసుకోవాల్సిన చర్యలు, బందోబస్తుపై సీపీ దిశానిర్దేశం చేశారు. 2010లో ప్రారంభమైన ఈ యాత్ర అతి తక్కువ కాలంలోనే దేశవ్యాప్త గుర్తింపు పొందిందని, సీతారాంబాగ్ నుంచి హనుమాన్ వ్యాయామశాల వరకు సాగే ఈ వేడుకను భక్తులు భక్తిశ్రద్ధలతో, క్రమశిక్షణతో జరుపుకోవాలని కోరారు. భద్రత కోసం సుమారు 3 వేల మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, అడుగడుగునా సీసీ కెమెరాలు, డ్రోన్ల నిఘా ఉంటుందని స్పష్టం చేశారు. ముఖ్యంగా చైన్ స్నాచింగ్ వంటి నేరాలు జరగకుండా క్రైమ్ టీమ్స్, మహిళల రక్షణ కోసం షీ టీమ్స్ నిరంతరం నిఘా ఉంచుతాయని తెలిపారు. గతేడాది వాహనాల బ్రేక్‌డౌన్ వల్ల యాత్ర నెమ్మదించిన విషయాన్ని గుర్తు చేస్తూ, ఈసారి అలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. శోభాయాత్రను మధ్యాహ్నం 1 గంట కల్లా ప్రారంభించాలని, ఇరుకైన మార్గాల్లో పెద్ద వాహనాల వల్ల ఇబ్బంది తలెత్తకుండా ముందస్తుగా ట్రయల్ రన్ నిర్వహించుకోవాలని నిర్వాహకులకు సూచించారు. శబ్ద కాలుష్యం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకుని, డీజేలకు బదులుగా సాధారణ సౌండ్ సిస్టమ్ వాడాలని, ఇతర వర్గాల మనోభావాలు దెబ్బతినకుండా పాటలు, ప్రసంగాలు ఉండాలని స్పష్టం చేశారు. ప్రైవేట్ వ్యక్తులు డ్రోన్లు వాడాలనుకుంటే పోలీసుల అనుమతి తప్పనిసరి అని తెలిపారు. ప్రజలు, ఉత్సవ సమితి సభ్యులు పోలీసులకు సహకరించి శోభయాత్రను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ మాట్లాడుతూ..భక్తులకు అసౌకర్యం కలగకుండా రోడ్ల మరమ్మతులు, వీధి దీపాల ఏర్పాటును ఇప్పటికే పూర్తి చేశామని తెలిపారు. శోభాయాత్రలో పాల్గొనే వాహనాల ఎత్తు విషయంలో నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శ్రీరామనవమి శోభాయాత్ర నిర్వాహకులు భగవంతరావు,గోవింద్ రాఠి,ఆనంద్ సింగ్, కృష్ణ, మాజీ కార్పొరేటర్ శశికల, మాజీ కార్పొరేటర్ లాల్‌సింగ్ తదితరులు శోభాయాత్ర సందర్భంలో ఎదురయ్యే సమస్యలను ప్రస్తావించగా..దీనిపై సీపీ స్పందిస్తూ అన్నింటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం శోభాయాత్ర వెళ్లే రూట్‌ను జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌తో కలిసి సీపీ గారు పరిశీలించారు. ఈ సమావేశంలో అడిషనల్ సీపీ తఫ్సీర్ ఇక్బాల్, జాయింట్ సీపీలు జోయల్ డేవిస్, ఎన్. శ్వేత, జోనల్ కమిషనర్ ముకుంద రెడ్డి, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులకు తక్షణ చర్యలు : ఎంఎంసి కమిషనర్ వినయ్ క్రిష్ణారెడ్డి

ఎంఎంసిలో ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, చిత్రంలో అడిషనల్ కమిషనర్ రఘుప్రసాద్ తదితరులు

హైదరాబాద్, మార్చి 23, ప్రభాతవార్త

మల్కాజిగిరి నగరపాలక సంస్థ (ఎంఎంసి) ప్రధాన కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం జరిగింది. ఈ ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్‌తో పాటు అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు. సోమవారం ఉదయం నుండి మధ్యాహ్నం వరకు జరిగిన ఈ కార్యక్రమంలో కమిషనర్ టి. వినయ్ క్రిష్ణారెడ్డి అన్ని విభాగాల విభాగాధిపతులతో కలిసి పాల్గొని ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజావాణిలో 39 విజ్ఞప్తులు అందాయి. వాటిని స్వీకరించిన కమిషనర్ అనంతరం సంబంధిత విభాగాలకు పంపించి తక్షణ పరిష్కారం కోసం ఆదేశాలు జారీ చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో మున్సిపల్ కార్పొరేషన్ కట్టుబడి ఉందని, వాటి పరిష్కారం వరకు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తామని కమిషనర్ తెలిపారు.వాటిలో ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించినవి 13, టౌన్‌ప్లానింగ్ విభాగానికి 16,ఫైనాన్స్, పారిశుధ్యం,ఐటీ విభాగం, విజిలెన్స్, అర్బన్ బయోడైవర్సిటీ, హౌసింగ్, యూసీడీ విభాగాలకు సంబంధించిన ఫిర్యాదులు నమోదయ్యాయి. ఈ సందర్భంగా ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన లభిస్తోందన్నారు. వచ్చిన ఫిర్యాదులు, విజ్ఞప్తులను సంబంధిత విభాగాలకు పంపించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

ట్రాన్స్‌ఫర్ స్టేషన్ ను పరిశీలించిన ఎంఎంసీ కమిషనర్

చెత్త సేకరణ కోసం ప్రతి వీధికి చెత్తను తరలించే వాహనాలు తప్పకుండా వెళ్లాలని మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ వినయ్ కృష్ణా రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అమలవుతున్న 99 రోజుల కార్యాచరణ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మల్కాజ్‌గిరి మున్సిపల్ పరిధిలోని మల్లాపూర్, నాచారం ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా స్వచ్ఛ ఆటో టిప్పర్ల పనితీరు, హాజరు,చెత్త సేకరణ వ్యవస్థపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌కు అనుసంధానమైన సాట్ వాహనాల సంఖ్య, ఉదయం హాజరు, ఫీల్డ్‌లో వాటి వినియోగం, రూట్ కవరేజ్ మరియు సేవల లోపాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. అలాగే వాహనాలు అందుబాటులో లేని పరిస్థితుల్లో తీసుకోవాల్సిన ప్రత్యామ్నాయ చర్యలను కూడా పరిశీలించారు.ఏ ఒక్క రూట్ కూడా చెత్త సేకరణ ఎట్టి పరిస్థితుల్లోనూ మిస్ కాకూడదని కమీషనర్ స్పష్టం చేశారు. ఏదైనా చెత్త వాహనం అందుబాటులో లేకపోతే వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో నాచారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ నిత్యానంద్ గారు, డీ ఈ ఈ శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల అర్జీలను సత్వరమే పరిష్కరించాలి : అదనపు కలెక్టర్ కదిరవన్ పలని

అర్జీలను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు కదివరన్, జితేందర్‌రెడ్డి, డిఆర్‌వో వెంకటాచారి తదితరులు

హైదరాబాద్, మార్చి 23,ప్రభాతవార్త:

ప్రజా ఆర్జీలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్,(రెవిన్యూ) కదిరవన్ పలని జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) జి. జితేందర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి ఈ. వెంకటాచారిలతో కలిసి ప్రజావాణి పాల్గొని ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు.ప్రజలు అందచేసిన అర్జీలను శాఖల వారీగా సంబంధిత అధికారులు పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని ఆయన సూచించారు. సీఎం ప్రజావాణి, వాట్సప్ ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులను శాఖల వారీగా సమీక్షించి వేగవంతంగా పరిశీలన చేసి పరిష్కరించాలని ఆయన సూచించారు. ఈ వారం ప్రజావాణి లో హౌసింగ్ శాఖ కు సంబంధించి 240, రెవెన్యూ శాఖ కు సంబంధించి 57, అలాగే ఇతర శాఖలకు సంబంధించి 14 అర్జీలు మొత్తం 311 దరఖాస్తులు అందాయని తెలిపారు. వచ్చే ఏప్రిల్ 10న దిశా సమావేశం నేపథ్యంలో జిల్లా అధికారులు తమ శాఖల ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుకు సంబంధించిన వివరాలను జిల్లా ప్రణాళిక శాఖలో మార్చి 25 లోపు సమర్పించాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ అశోక్ చక్రవర్తి, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పవన్ కుమార్, ఆర్.డి.ఓలు రామకృష్ణ , సాయి రామ్, సిపిఓ డాక్టర్ సురేందర్, సంక్షేమ శాఖాధికారులు ప్రవీణ్ కుమార్, ఆశన్న, ఇలియాస్ అహ్మద్, డిఎంహెచ్ఓ డా.వెంకటి, జిల్లా అధికారులు, ఏ.ఓ విజయలక్ష్మి, కలెక్టరేట్ విభాగాల సూపరింటెండెంట్లు, తదితరులు పాల్గొన్నారు

వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్

అత్తాపూర్ మార్చి23,ప్రభాతవార్త : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి, తొమ్మిది అనుబంధ కళాశాలల నుండి అండర్‌గ్రాడ్యుయేట్, పోస్ట్‌గ్రాడ్యుయేట్ మరియు పీ.హెచ్‌డీ విద్యార్థుల కోసం మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహిస్తోంది. ఈ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో వ్యవసాయం, కమ్యూనిటీ సైన్స్ మరియు అగ్రికల్చరల్ ఇంజినీరింగ్ విభాగాలు పాల్గొంటున్నాయి. ఈ కార్యక్రమం సోమవారం నుండి 26 వరకు రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ కళాశాలలో నిర్వహిస్తున్నారు.ఈ భారీ ప్లేస్‌మెంట్ కార్యక్రమంలో సుమారు 50 ప్రముఖ సంస్థలు పాల్గొననున్నాయి. పరిశోధన మరియు అభివృద్ధి నుండి మార్కెటింగ్ వరకు విభిన్న రంగాలలో ఉద్యోగ అవకాశాలు అందిస్తున్నాయి. విశ్వవిద్యాలయం ఇంత పెద్ద స్థాయిలో ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించడం ఇదే మొదటిసారి.ఈ కార్యక్రమానికి విద్యార్థి వ్యవహారాల డీన్ డా. వేణుగోపాల్ రెడ్డి, వ్యవసాయ డీన్ డా. జి. ఝాన్సీ రాణి, పరిశోధన సంచాలకులు డా. బాలరామ్ మరాఠీ, అగ్రి ఇంజినీరింగ్ మరియు టెక్నాలజీ డీన్ డా. కె.వి. రమణారావు, రాజేంద్ర నగర్ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా. ఎం. గోవర్ధన్ పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించి, ఇలాంటి కార్యక్రమాల ప్రాముఖ్యతను వివరించారు.మొదటి రోజు ఐదు సంస్థల ప్రతినిధులు ప్రీ‌ప్లేస్‌మెంట్ పై అవగాహన కల్పించారు. ఆయా సంస్థల గురించి వివరాలు తెలియజేసి, ఉద్యోగ బాధ్యతలు మరియు అంచనాలను వివరించారు. ప్రారంభ రోజున మొత్తం 13 సంస్థలు తమ ఎంపిక ప్రక్రియలను ప్రారంభించాయి.ఈ కార్యక్రమం ద్వారా విశ్వవిద్యాలయం విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలను కల్పించాలనే ఉద్దేశంతో ఈ మేఘా ప్లేస్మెంట్ డ్రైవ్ ను నిర్వహిస్తోందని అధికారులు వెల్లడించారు.

ఫ్లైఓవర్‌పై డివైడర్‌ను ఢీకొన్న కళాశాల బస్సు

హైదరాబాద్ మార్చి 23 (ప్రభాతవార్త) : నారాయణగూడ ఫ్లైఓవర్‌పై సోమవారం సాయంత్రం ఓ ప్రేవేట్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థుల బస్సు నియంత్రణ కోల్పోయి రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. అతివేగంగా దూసుకొచ్చిన బస్సు అదుపుతప్పి డివైడర్ ను ఢీ కొట్టి ఆగిపోయింది. దీంతో నారాయణగూడ ఫ్లైఓవర్ పై ట్రాఫిక్ భారీగా స్తంభించింది. కాగా ప్రమాద సమయంలో బస్సులో విద్యార్థులు ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అనంతరం పోలీసులు అక్కడికి చేరుకొని , క్రేన్ సహాయంతో బస్సును అక్కడి నుండి తొలగించడంతో , ట్రాఫిక్ ముందుకు సాగింది. హిమాయత్ నగర్ వైపు నుండి నారాయణగూడ వైపు వెళ్తున్న క్రమంలో, ఫ్లైఓవర్‌పై బస్సు ఒక్కసారిగా అదుపు తప్పింది. వేగంగా వెళ్తున్న బస్సు డివైడర్‌ను ఎక్కి, అక్కడ ఉన్న విద్యుత్ స్తంభాన్ని తాకి ఆగిపోయింది. ప్రమాద తీవ్రతకు బస్సు ముందు భాగం స్వల్పంగా దెబ్బతింది. అదృష్టవశాత్తు ఆ సమయంలో బస్సులో విద్యార్థులు తక్కువ సంఖ్యలో ఉండటం, ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఫ్లైఓవర్‌పై బస్సు అడ్డంగా నిలిచిపోవడంతో హిమాయత్ నగర్ నుండి నారాయణగూడ వైపు వెళ్లే మార్గంలో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీని ప్రభావంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఆఫీసుల నుండి ఇళ్లకు వెళ్లే సమయం కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కాగా సమాచారం అందుకున్న వెంటనే నారాయణగూడ ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్రేన్ సహాయంతో బస్సును పక్కకు తొలగించి, ట్రాఫిక్ను క్రమబద్ధీకరించే చర్యలు చేపట్టారు. ఈ మార్గంలో ప్రయాణించే వారు అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్ ఇబ్బందుల దృష్ట్యా ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. కాగా ఈ ఘటన వల్ల ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు.

కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయం హుండీలలో పిల్లలు ఆడుకునే నకిలీ కరెన్సీ నోట్లు

హుండీలలో లభ్యమైన పిల్లలు ఆడుకునే నకిలీ కరెన్సీ నోట్లు

సైదాబాద్, మార్చి 23 ప్రభాతవార్త: చారిత్రక నేపథ్యం కలిగిన కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయం హుండీలను సోమవారం లెక్కిస్తుండగా హుండీలలో పిల్లలు ఆడుకునే నకిలీ కరెన్సీ నోట్లు ఉండడం కలకలం సృష్టించింది. గత 145 రోజులకు సంబంధించిన హుండీల ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. హుండీలలోని డబ్బును లెక్కింస్తుండగా వాటిలో పిల్లలు ఆడుకునే నకిలీ కరెన్సీ నోట్లు కనిపించాయి. ఆ నోట్లపై చిల్డ్రన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అని ఉంది. గతంలో ఎప్పుడు కూడా ఇలాంటి నకిలీ నోట్లు హుండీలలో రాకపోవడంతో, వీటిని చూసిన దేవాలయ సిబ్బంది సైతం ఆశ్చర్యానికి గురయ్యారు. నకిలీ కరెన్సీ నోట్లను హుండీలో ఎందుకు వేసి ఉంటారో ఎవరికి అర్థం గాక అయోమయానికి గురయ్యారు. తల్లిదండ్రుల వెంట వచ్చిన పిల్లలు ఎవరైనా తమతో తెచ్చు కున్న ఆడుకునే కరెన్సీ నోట్లను హుండీలో వేసి ఉంటారేమోనన్న అనుమానాలు వ్యక్తమ వుతున్నాయి. లేక పెద్దవారే ఎవరైనా వేసి ఉంటే ఎందుకు వేశారో అన్నది ఎవరికి అర్థంగాని ప్రశ్నగానే ఉంది. పిల్లలు ఆడుకునే నకిలీ కరెన్సీ నోట్లతో పాటు రెండు ఫేక్ కరెన్సీ నోట్లు కూడా హుండీలలో ఉన్నట్లు సిబ్బంది గుర్తించారు.

ప్రాపర్టీ టాక్స్ డిఫాల్టర్లపై జిహెచ్ఎంసి కొరడా

సోమాజిగూడలో హోటల్..గోషాహహల్‌లో ట్రాన్స్‌పోర్ట్
బంజారాహిల్స్‌లో మాల్ సీజ్

హోటల్ సీజ్ చేస్తున్న జిహెచ్ఎంసి అధికారులు

హైదరాబాద్, మార్చి 23,ప్రభాతవార్త:

టాప్ ప్రాపర్టీ టాక్స్ డిఫాల్టర్‌లపై జీహెచ్ఎంసీ కొరడా ఝులిపిస్తుంది. డిఫాల్టర్ ల పై చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ డిప్యూటీ కమిషనర్ లకు ఆదేశాలు చేయడంతో డిసిలు చర్యలు ప్రారంభించారు. ఈనేపథ్యంలో ప్రాపర్టీ టాక్స్ చెల్లింపుల్లో అలసత్వం వహిస్తున్న సోమాజిగూడలోని క్షత్రియా హోటల్ జప్తు చేశారు. క్షత్రియా హోటల్ ఆస్తి పన్ను బకాయిలు రూ. 6 కోట్ల 16 లక్షలు గాఉంది. గోషామహల్ సర్కిల్‌లో స్వర్ణ ట్రాన్స్‌ఫోర్ట్‌ను 36లక్షల బకాయి ఉండగా గోషామహల్ సర్కిల్ వారెంట్ బృందం దాన్ని సీజ్ చేశారు. అలాగే బంజారా హిల్స్, రోడ్ నం. 10 వద్ద ఉన్న షమీమ్ సుల్తానా క్లాత్ మాల్ 35.27లక్షల బకాయి చెల్లించాల్సి ఉండగా అధికారులు వాటిని సీజ్ చేశారు.

ఆస్తి పన్ను చెల్లించివడ్డీపై 90 శాతం రాయితీ పొందండి : కమిషనర్ ఆర్ వి కర్ణన్ :

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్న గృహ యజమానులు ఆస్తి పన్ను బకాయిలు తక్షణమే చెల్లించి వడ్డీపై 90 శాతం రాయితీ పొందాలనికమిషనర్ ఆర్ వి కర్ణన్ అన్నారు.ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2025-26 సంవత్సరానికి గానూ రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి పన్ను బకాయిలు ఈ నెల 31 వ తేదీలోగా చెల్లించే వారికి ఓటీఎస్ పథకం కింద వడ్డీపై 90 శాతం రాయితీ ఇస్తుందన్నారు.ఆస్తిపన్ను బకాయిలు ఆన్లైన్ లో మాత్రమే స్వీకరిస్తామని కమిషనర్ తెలిపారు. సకాలంలో ఆస్తి పన్ను చెల్లించి తద్వారా నగరాభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు.ఆస్తి పన్ను మొండి బకాయిదారులపై జీహెచ్ఎంసీ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని కమిషనర్ స్పష్టం చేశారు.

యువత క్రీడారంగంలో రాణించాలి: శంభీపూర్ క్రిష్ణ

పోటీల ప్రారంభోత్సవంలో పాల్గొన్న శంభీపూర్ క్రిష్ణ

దుండిగల్, మార్చి 23 ప్రభాతవార్త: దుండిగల్ సర్కిల్ పరిధి భౌరంపేటలోని కార్తికేయ గ్రౌండ్స్‌లో వడ్డెర సంఘం వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను కుత్బుల్లాపూర్ బిఆర్ఎస్ నాయకులు, మాజీ కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడా రంగంలో రాణించాలన్నారు. పోటీలలో జయాపజయాలు సాధరణమని, జట్టు కృషి, క్రీడాస్ఫూర్తి, క్రమ శిక్షణలే విలువైనవని పేర్కొన్నారు. క్రాడాకారులు తమ నైపుణాన్ని ప్రదర్శించడానికి శాశ్వత స్నేహబంధాలను పెంపొందించుకోవడానికి లభించిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గడ్డపోతారం మున్సిపల్ బిఆర్ఎస్ యువనాయకులు గడ్డె గణేస్, కుమార్‌యాదవ్, అరికెల సురేష్, కుమ్మరి మల్లేష్, తిరుపతి, రాజు, బాలరాజు, బాలు,పాల్గొన్నారు.

డబుల్‌బెడ్‌రూమ్ వాసులకు మౌలిక సదుపాయాలు కల్పించండి

కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సిద్దనోళ్ల సంజీవరెడ్డి, కైసర్‌నగర్ డబుల్‌బెడ్‌రూమ్ వాసులు

కుత్బుల్లాపూర్, మార్చి 23 ప్రభాతవార్త

కుత్బుల్లాపూర్ జోనల్ పరిధిలోని కైసర్‌నగర్ డబుల్‌బెడ్ వాసుల సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేకదృష్టి పెట్టాలని నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, గాజులరామారం డివిజన్ అధ్యక్షులు సిద్ద నోళ్ల సంజీవరెడ్డి విజ్ఞప్తిచేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి కొలను హనుమంతరెడ్డి సూచనలమేరకు గాజులరామారం కైసర్‌నగర్ డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లవాసులు ఎదుర్కొంటున్న సమస్యలపై స్థానిక నాయకులు, ప్రజలతో కలసి కుత్బుల్లాపూర్ జోనల్‌కమిషనర్ పింకేశ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిద్దనోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ గతప్రభుత్వం డబుల్‌బెడ్‌రూమ్‌లను మంజూరీచేసి మౌళికసదుపాయాలను కల్పించడంలో విఫలమైందని ఆందోళన వ్యక్తంచేశారు. కైసర్‌నగర్ డబుల్‌బెడ్‌రూమ్ సంక్షేమ సంఘ ప్రతినిధులు , కాంగ్రెస్ నాయకులు వలి, వేణు, యాదగిరి, జగన్, బ్రహ్మాచారి, స్వాతి, నాగమణి, సరితలతోపాటు పెద్దఎత్తున కైసర్‌నగర్ ప్రజలు కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేశ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రధానంగా ఫోరింగ్ సమస్యతో పాటు అవుట్‌లెట్, కాంపౌండ్‌వాల్ సమస్యలను జోనల్‌కమిషనర్ పింకేశ్‌కుమార్ దృష్టికి తీసుకురాగా ఆయన సానుకూలంగా స్పందించి వెంటనే వాటి పరిష్కారానికి చర్యలు చేపడతాని హామీఇచ్చారు.

శ్రీసీతారాముల కల్యాణోత్సవానికి ఏర్పాట్లు



ఆదం సంతోష్‌కుమార్‌కు పత్రికను అందజేస్తున్న దృశ్యం

సికింద్రాబాద్, మార్చి 23 ప్రభాతవార్త:

నామాలగుండులోని శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో ఈనెల 27న జరుగనున్న శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించడం కోసం ఆలయ చైర్మన్ కాచంరాము, ధర్మకర్తల మండలి సభ్యులు మున్నూరు చందు ఇతర సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు ప్రారంభించారు. స్వామివారి కల్యాణోత్సవ పత్రికను సికింద్రాబాద్ కాంగ్రెస్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఆదం సంతోష్ కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమంతో పాటు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు జరుపుతున్నట్లు తెలిపారు. ఎంతో వైభవంగా జరిగే ఉత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో శ్యామల్ రమనజ సాయికుమార్, ప్రణవ్ తదితరులు పాల్గొన్నారు.

27న సీతారాముల స్వామి కళ్యాణోత్సవం

జూబ్లీహిల్స్, మార్చి 23, ప్రభాతవార్తః

ఈ నెల 27న శ్రీనగర్‌కాలనీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీసీతారాముల స్వామి కళ్యాణోత్సవం నిర్వహించ నున్నట్లు ఆలయ చైర్మన్ సిపిరి అర్జున్ యాదవ్, ఈఓ శ్రీనివాస శర్మ తెలిపారు. ఉదయం 11 గంటలకు ఈ కళ్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కళ్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 25(రేపు)న ఆలయంలోని హుండీని లెక్కించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

కాముని చెరువును సందర్శించిన హైడ్రా కమిషనర్



చెరువు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

హైదరాబాద్, మార్చి 23,ప్రభాతవార్త:

మూసాపేటలోని కాముని చెరువును హైడ్రా కమిషనర్ రంగనాథ్ సోమవారం సందర్శించారు. రెండో విడత చేపడుతున్న 14 చెరువుల్లో కాముని చెరువు కూడా ఉందనే విషయం విధితమే.. ఈచెరువు పునరుద్ధరణను వెంటనే చేపట్టాలని అక్కడి స్థానికులు కమిషనర్‌ను కలిసి విన్నవించారు. కూకట్‌పల్లి నల్ల చెరువులా దీనిని కూడా అభివృద్ధి చేస్తే దోమల ఇబ్బందులు తగ్గుతాయని దుర్గంధం దూరమౌతుందని పలువురు పేర్కొన్నారు. దోమల వల్ల ప్రస్తుతతం నివాసాల తలుపులు తీయలేకపోతున్నామని వాపోయారు. అయితే ఈ చెరువు పునరుద్ధరణకు సంబంధించి హెచ్‌ఎండీఏ నుంచి సాంకేతిక అనుమతులు రావాల్సి ఉందని అవి రాగానే పనులను స్పీడప్ చేస్తామని ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్‌కు అక్కడ పనులు పర్యవేక్షిస్తున్న అధికారులు వివరించారు. ఈ లోగా దోమల ఇబ్బంది తలెత్తకుండా గుర్రపు డెక్కను తొలగించాలని.. చెరువులోని మురుగు నీటిని బయటకు పంపాలని హైడ్రా కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కాముని చెరువు నుంచి మూసాయి కుంటకు వెళ్లే వరద కాలువ పనులను కూడా హైడ్రా కమిషనర్ పరిశీలించారు. కాలువ నిర్మాణాల్లో సాంకేతిక లోపాలను పరిశీలించి నిర్మాణ దశలోనే వాటిని పరిష్కరించాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. వరద ప్రవాహానికి ఆటంకం లేకుండా కాలువ నిర్మాణ పనులను పూర్తి చేయాలని నిర్మాణ సంస్థ ప్రతినిధులకు హైడ్రా కమిషనర్ సూచించారు. ఈ వర్షాకాలానికి చెరువును పునరుద్ధరించి.. ఫ్రెష్ వాటర్ చేరేలా చూడాలని అధికారులను ఆదేశించారు

ప్రజల ఐక్యతే ఆయుధం..సమిష్టి పోరాటంతోనే మార్పు సాధ్యం : దాసు సురేష్

లలితకు నియామక పత్రం అందజేస్తున్న సురేష్

జీడిమెట్ల, మార్చి 23 ప్రభాతవార్త: బిసి రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో జీడిమెట్లలో నిర్వహించిన బస్తీబాట కార్యక్రమానికి సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేష్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సమిష్టిగా ఉద్యమిస్తేనే సమస్యలు పరిష్కారాం అవుతాయని పేర్కొన్నారు. ప్రజల దగ్గరకు వెళ్ళి సమస్యలను పరిష్కరించడమే నిజమైన నాయకత్వం అన్నారు. తెలంగాణ ఏర్పడి పదేళ్ళు దాటిన బిసి, ఎస్సి,ఎస్టి,మైనార్టీలకు రాజకీయ ప్రాతినిధ్యం, ఉద్యోగాలు, సంక్షేమ పథకాల అమలులో ఇంకా వివక్ష కొనసాగుతొందని ఆవేదన వ్యక్తం చేశారు. బిసి రాజ్యాధికార సమితి బస్తీబాట కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకు వెళ్ళి సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉందని తెలిపారు. త్వరలో జిహెచ్ఎంసి స్థాయిలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించి ప్రజల సమస్యలను అధికారులకు నేరుగా చేరవేసి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజలు తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రధాన గంజాయి ముఠాల వేధింపులపై ఎసిపి శంకర్‌రెడ్డికి ఫిర్యాదు చేయగా ఆయన స్పందిస్తూ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి కట్టడి చేస్తామని హామినిచ్చారు. అదే విధంగా ఫించన్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, రేషన కార్డులు, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ వంటి సమస్యలను సంబంధితశాఖ అధికారులతో నేరుగా కలిసి త్వరితంగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. బిసిలకు రాజకీయ అధికారం, సామాజిక గౌరవం, ఆర్థిక సాధికారత సాధించేందుకు ప్రజలు ఏకమవ్వాలని పిలుపునిచ్చారు. అనంతరం కార్యక్రమాన్ని విజయవంతం చేసిన బాల్నే లలితను రాష్ట్ర మహిళా కార్యదర్శిగా నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. జీడిమెట్ల బస్తీబాట కమిటిని 21 మంది సభ్యులతో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సమితి సిఇవో పోశాల సరస్వతి, సీనియర్ సిటిజన్స్ విభాగం అధ్యక్షురాలు శారదాదేవి, అచ్చి సీత, అచ్చమ్మ, నందిని, మోహన్‌రావురాజా, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సాహిత్యం, సంగీతం సమాజానికి ప్రాణవాయువు : డాక్టర్ కసిరెడ్డి వెంకట రెడ్డి

గ్రంథాలను ఆవిష్కరిస్తున్న ఆచార్య కసిరెడ్డి వెంకట్ రెడ్డి, చిత్రంలో గంగాధర శాస్త్రి , డాక్టర్ భాష్యం శ్రావణ్ కుమార్

చిక్కడపల్లి మార్చి 23 (ప్రభాతవార్త) : సాహిత్యం, సంగీతం సమాజానికి ప్రాణవాయువు వంటివి అని జాతీయ సాహిత్య పరిషత్ పూర్వ అధ్యక్షులు డాక్టర్ కసిరెడ్డి వెంకట రెడ్డి అన్నారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సాహిత్య సంగీత సభ టీచర్ అంచల సుబ్బన్న మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు అంచల పంపావతి, డాక్టర్ అంచల పార్థసారథి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా"ప్రణామం" పేరుతో యూట్యూబ్ ఛానెల్, చిన్నారుల కోసం వర్డ్స్ ఆఫ్ విజ్డమ్ ఈ బుక్ ఫర్ కిడ్స్ రిథమ్, తెలుగు, ఆంగ్ల అనువాదంతో కూడిన శంకరాచార్య విరచిత భజగోవిందం గ్రంథాల ఆవిష్కరించి ప్రసంగించారు. మారుతున్న కాలంలో యువత మన సంస్కృతిని, సంప్రదాయాలను ప్రతిబింబించే పుస్తకాలను చదవాల్సిన అవసరం ఉందన్నారు ప్రణామం వంటి గ్రంథాలు, భజగోవిందం వంటి ఆధ్యాత్మిక అనువాదాలు నేటి తరం ఆలోచనా దృక్పథాన్ని మారుస్తాయి" అని పేర్కొన్నారు. సాహిత్యం కేవలం వినోదం కోసం కాదు, అది వ్యక్తిత్వ వికాసానికి పునాది అని అన్నారు.బాల్యంలోనే నైతిక విలువలను నేర్పించడం ద్వారా బాధ్యతాయుతమైన పౌరులను తయారు చేయవచ్చు" అని అన్నారు. భగవద్గీత ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎల్. గంగాధర శాస్త్రి సంగీతం మనసును ప్రశాంతంగా ఉంచుతుందని, ఆధ్యాత్మిక సాహిత్యంతో కూడిన సంగీతం మనిషిని ఉన్నత శిఖరాలకు చేరుస్తుందని తెలిపారు. ప్రముఖ కవి శ్రీ భజ, నృత్య అకాడమీ సంచాలకులు సత్యప్రియ రమణ, న్యూ ఎరా కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ భాష్యం శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టాలి

-ఇంధన శాఖ ప్రత్యేక కార్యదర్శి నవీన్ మిట్టల్

కార్యక్రమంలో పాల్గొన్న నవీన్‌మిట్టల్, గిరీష్ ,శ్రీకాంత్ పాఠక్ తదితరులు

హైదరాబాద్, మార్చి 23,ప్రభాతవార్త:

యువతకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టాలని రాష్ట్ర ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ సూచించారు. ఎంపీఎం గ్రూప్ సీ గ్రూప్ సీఎండీ గిరీష్ ముల్లపాని అధ్యర్యంలో స్థాపించిన సింపోజియం ఒక ప్రత్యే కమైన ఎలైట్ ఫోరం విజన్ వీడియో వెబ్సైట్‌ను నాలెడ్జ్‌సిటీలోని టీ హబ్‌లోప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ప్రపంచంలో ప్రస్తుతం జరుగుతున్న యుద్ధాల ప్రభావం అందరిపై ఎంతో కొలత ప్రభావం చూపిస్తోందని, దానికి అధిగమిం చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని చర్యలు తీసుకుంటున్నాయన్నారు. శ్రీకాంత్ పాఠక మాట్లాడుతూ.. సింపోజియం ద్వారా జ్ఞానాన్ని నలుగురికి సంచేలా చేసేందుకు దీన్ని ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రానికి ఎన్ని పెట్టుబడులు వచ్చాయని కాదని, ఎన్ని గ్రౌండ్ అయ్యాయన్నదే ముఖ్యమన్నారు. ఏఐతో భయపడాల్సిన పనిలేదని దాని ద్వారా జాబ్లు కూడా పెరుగుతాయ న్నారు. ఎంతోమంది ఏఐ నేర్చుకుంటూ తమ వృత్తి నైపుణ్యాలు పెంచుకోవడంపై దృష్టి పెరుతున్నారన్నారు. గిరిష్ మల్లపాని మాట్లాడుతూ.. హైదరాబాద్ జ్ఞానికి పెద్ద పీట వేసే నగరంగా మారిందని సమాచారం ఇతర అంశాలను నలుగురికి వంచేందుకు సింపోజియంను ఏర్పాటు చేశామన్నారు. ఈకార్యక్రమంలో సైయింట్ వ్య వస్థాపకుడు బివిఆర్ మోహన్‌రెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్ అజ య్ మిశ్రా, మాజీ డీజీపీ అంజనీకుమార్, సమీర్ శర్మ, కేక్ మహేశ్వరి, శృతి మాల్పని తదితరులు పాల్గొన్నారు.

ప్రయోజనాత్మకం రసరంజని నాటకప్రదర్శనలు : డా. కె.వి.రమణాచారి

రసరంజని 33వ వార్షిక నాటకోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న రమణాచారి, రామకోటేశ్వరరావు, నటరాజ్, నారాయణస్వామి తదితర సంస్థ సభ్యులు

నాంపల్లి, మార్చి 23 ప్రభాతవార్త : గత 33 సంవత్సరాలుగా రసరంజని రంగస్థల సాంస్కృతిక సంస్థ ప్రయోగాత్మకంగా, ప్రయోజనాత్మకంగా టిక్కెట్ కొనే నాటకం చూడాలన్న సంకల్పం లక్ష్యం సంప్రదాయం ప్రేక్షకుల్లో కలిగించి విజయవంతంగా ప్రతీనెలా నాటక ప్రదర్శనలు నిర్వహిస్తూ యావత్ నాటకరంగాన్ని అన్నివిధాలా ప్రోత్సహిస్తూ వస్తోందని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు, విశ్రాంత ఐఎస్ అధికారి రసరంజని అధ్యక్షుడు డా. కె.వి.రమణాచారి తెలిపారు. ఉభయ తెలుగురాష్ట్రాల ప్రజలు, నాటక సంస్థల సహకారంతో నిర్విరామంగా కొనసాగుతూ ఈ నెల 25 నుండి 27వరకు 3రోజుల పాటు 33వ వార్షికోత్సవ వేడుకలను నేత్రపర్వంగా జరుపనున్నట్లు రెడ్‌హిల్స్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంబంధిత ఆహ్వానపత్రికను సంస్థ ఉపాధ్యక్షుడు డి.రామకోటేశ్వరరావు, అరుణ్‌కుమార్, నారాయణస్వామి, పుండరీకాక్షశర్మ తదితరులతో కలిసి ఆవిష్కరించి వివరాలు వెల్లడించారు. ప్రతీ సంవత్సరం ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని సమన్వయపరచుకుంటూ మార్చి నెలలో సంస్థ వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సహకారంతో రసరంజని ఈ సంవత్సరం వేడుకలు నిర్వహిస్తున్నట్లు, డైరెక్టర్ డా. ఏనుగు నరసింహారెడ్డికి, తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెప్పారు. మూడురోజులపాటు ప్రతీ రోజూ రాత్రి 6.30గంటల నుండి ప్రారంభమయ్యే ఈ వేడుకలలో 25 మొదటిరోజు పి.లక్ష్మీకులశేఖర్ రచన, పత్తి ఓబులయ్య దర్శకత్వంలో సామా పద్యనాటకం; 26న ఆచార్య మొదలి నాగభూషణశర్మ తెలుగు అనువాదం, డా. షైక్ బషీర్ దర్శకత్వంలో అంధయుగం నాటకం; చివరిరోజు 27న డా. డి.విజయభాస్కర్ రచన, మోహనసేనాపతి దర్శకత్వంలో తిమిరజ్వాల నాటకం ప్రదర్శింపబడతాయని పేర్కొన్నారు. ఈ 33వ వార్షికోత్సవ వేడుకలను తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటకశాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభిస్తారని, రెండవరోజు బుల్లినేని కృష్ణయ్య ముఖ్యఅతిథిగా, మూడవరాజు సారిపల్లి కొండలరావు ముఖ్యఅతిథిగా, వీరితోపాటు పలువురు ప్రముఖులు విశిష్ట అతిథులుగా పాల్గొంటారని చెప్పారు. 27న ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని పురస్కరించుకుని రసరంజని ప్రతీయేటా అందిస్తున్న యువపురస్కారం, 25వేల నగదు బహుమతి కావలి మనోహర్‌ను ఘనంగా సత్కరించి ప్రదానం చేయనున్నట్లు డా. కె.వి.రమణాచారి విశదీకరించారు. ఈ 3రోజుల రసరంజని 33వ వార్షికోత్సవ నాటకోత్సవాలను అధికసంఖ్యలో రంగస్థల ప్రియులు, ఔత్సాహిక ప్రేక్షకులు విచ్చేసి ఆస్వాదించి, విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మహోన్నత చరిత్ర వెలుగులోకి రావాలి : స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

'మేము సైతం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

హైదరాబాద్, మార్చి 23 ప్రభాతవార్త ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ఘనమైన చారిత్రక వైభవం భావి తరాలకు తెలియజేసేందుకు "మేము సైతం" స్వచ్ఛంద సంస్థ ద్వారా జర్నలిస్టులు ముందుకు రావడం ఆదర్శనీయం అభినందనీయం అని తెలంగాణ శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ సంతోషం వ్యక్తం చేశారు. సీనియర్ పాత్రికేయులు, తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి మీడియా సెల్ అధ్యక్షుడు బి. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కూకట్‌పల్లిలోని ప్రెకాస స్టూడియోలో మేము సైతం బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మేము సైతం బ్రోచర్ ను ఆవిష్కరించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మల్కాజిగిరి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాల సమగ్ర రూపాన్ని, చరిత్రను కళ్ళకు కట్టేలా వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. సభ ప్రారంభకులుగా విచ్చేసిన తెలంగాణ సమాచార హక్కు కమిషనర్ బోరెడ్డి అయోధ్యరెడ్డి మాట్లాడుతూ మేము సైతం సంస్థ తలపెట్టిన బృహత్తర కార్యక్రమం అద్భుతం అని, తాను సైతం భాగస్వామినై బాధ్యతగా తనవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. టీజీఎస్సీ ,డిడిఎంఎస్‌ఎ అధ్యక్షుడు ఉప్పు సత్యనారాయణ, సభాధ్యక్షత వహించిన సీనియర్ జర్నలిస్ట్ మహ్మద్ రఫీ మాట్లాడుతూ ఇప్పటికే భాగ్యనగర చరిత్ర ఎన్నో గ్రంథాల రూపంలోకి వచ్చినా ఏదీ సమగ్రంగా లేదని, జర్నలిస్టులు ఒక బాధ్యతగా ఈ ఐదు జిల్లాల్లోని మట్టిలో మాణిక్యాలను గుర్తించి వెలుగులోకి తెచ్చి భవిష్యత్ తరాలకు గొప్ప స్ఫూర్తి గ్రంథంగా అందించాలని సూచించారు. సీనియర్ పాత్రికేయులు ఎం. ప్రతాప్, పిసాటి జంగారెడ్డి, పైళ్ళ విఠల్ రెడ్డి, ఎర్ర యాకయ్య, తేళ్ల హరికృష్ణ, వినయ్ కుమార్ పాల్గొన్నారు. ప్రెకాస స్టూడియో యజమానులు సబిత మట్ల, ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో మేము సైతం కార్యక్రమంలో జరిగిన సంగీత విభావరిలో గాయకులు రాగరేఖ, కార్తికేయ తదితరులు చక్కని పాటలు ఆలపించి ఆకట్టుకున్నారు.

బిజెపి నేతలను హౌస్ అరెస్టు చేసిన పోలీసులు

నార్సింగి, మార్చి 23 ప్రభాతవార్త : తెలంగాణలోని కాంగ్రెస్ సర్కారు అవినీతి, కమీషన్ల పాలనను నిరసిస్తూ బిజెపి నాయకులు చేపట్టిన "చలో అసెంబ్లీ" కార్యక్రమానికి తరలి వెళ్లేందుకు సిద్దమవుతున్న రంగారెడ్డి జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యులు, మాజీ ఉప సర్పంచ్ నీరుడు శేఖర్ ముదిరాజ్‌ను రాజేంద్రనగర్ పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంను అప్పుల కుప్పగా మారుస్తూ, ప్రజల బతుకులను ఆగం చేస్తూ, భావి తరాల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్న కాంగ్రెస్ అధికారంలో ఉండే నైతికతను కోల్పో యిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఆచరణ సాధ్యంకాని ఆరు గ్యారెంటీలు, 420.హామీలిచ్చి ప్రజల ఓట్లను దండుకొని ఇప్పుడు అడుగడుగునా ప్రజా వ్యతిరే ఖ పనులను చేస్తున్నారని ఆరోపించారు. ఎక్కడికక్కడ బిజెపి నేతలను అరెస్టు చేసి, ఛలో అసెంబ్లీకి వెళ్లకుండా చేశారన్నారు.

మహిళల ముందడుగుతోనే సమాజ ప్రగతి : మాజీ మంత్రి తలసాని

సంజీవరెడ్డి నగర్, మార్చి 23, ప్రభాతవార్తః

మహిళలు అన్ని రంగాలలో రాణిస్తూ తమ ప్రతిభను చాటుతున్నారని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సనత్‌నగర్‌లోని మోడల్ కాలనీ కమిటీ హాల్‌లో సోమవారం సనత్‌నగర్‌కు చెందిన పెరుమాళ్ళ నాగమణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉమెన్స్ ఎంపవర్‌మెంట్ అవార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విద్య, ఉద్యోగం, వ్యాపారం, రాజకీయం, సమాజ సేవ రంగం ఏదైనా పురుషులతో సమానంగా మహిళలు తమ సత్తా చాటుతున్నారని, మహిళా శక్తి ఎంతో గొప్పదని రుజువు చేస్తున్నారన్నారు. రాబోయే రోజులలో పార్లమెంట్, అసెంబ్లీలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు కానున్నాయని, మహిళలకు రాజకీయంగా మరిన్ని అవకాశాలు లభిస్తాయని చెప్పారు. మహిళలు తమ ఇరుగు పొరుగు మహిళలతో తరచుగా సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని, తద్వారా తెలియని విషయాలను తెలుసుకోవాలని అన్నారు. నియోజకవర్గ పరిధిలోని మహిళలు తమకు తోచిన మేరకు వివిధ రకాల సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అభినందించారు. మహిళలు చేపట్టే కార్యక్రమాలకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. అనంతరం వివిధ రంగాలలో ప్రతిభ కనబర్చిన మహిళలకు తలసాని శ్రీనివాస్ యాదవ్ అవార్డులను అందించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, నిర్వాహకులు నాగమణి, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

మహిళలను సత్కరిస్తున్న తలసాని శ్రీనివాస్‌యాదవ్

ఆంజనేయ స్వామి ఆలయంలో వైభవంగా రాములవారి కల్యాణ లగ్నపత్రిక పఠనం

చిక్కడపల్లి, మార్చి 23, ప్రభాతవార్త : శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం చిక్కడపల్లి వివేక్ నగర్ లోని అత్యంత పురాతనమైన శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. లోకకళ్యాణార్థం నిర్వహించే శ్రీ సీతారామ చంద్రస్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవానికి సంబంధించి లగ్నపత్రిక పఠనం కార్యక్రమాన్ని ఆలయ కమిటీ అత్యంత వైభవంగా నిర్వహించింది. ఆలయ చైర్మన్ జానకి సుధాకర్, కార్యనిర్వహణాధికారి మాచర్ల దేవనాథం సమక్షంలో ప్రధాన అర్చకులు బుగ్గ లక్ష్మీపతి శర్మ శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్వామివారికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసిన అనంతరం, రాబోయే శ్రీరామనవమి నాడు జరగబోయే కల్యాణ ఘడియలను నిర్ణయిస్తూ లగ్నపత్రికను చదివి వినిపించారు. ఈ పవిత్ర కార్యం చూసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం రామనామ స్మరణతో మారుమోగింది.

చిక్కడపల్లి వివేక్ నగర్ లోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో రాములవారి సీతాదేవి కళ్యాణ మహోత్సవ లగ్నపత్రిక అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించిన దృశ్యం

భక్తులందరూ సీతారాముల కల్యాణ మహోత్సవంలో పాల్గొని తరించాలని ఆలయ నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణమంతా రామనామ స్మరణతో మారుమోగింది.

పాతబస్తీ అభివృద్ధి కోసం బిఆర్ఎస్ కృషి : మహమూద్ అలీ

మాజీ హోం మంత్రి మహమూద్ అలీని కలిసిన తెలంగాణ బెంగాలీ సమితి అధ్యక్షులు దీపాంకర్

చార్మినార్,మార్చి 23 ప్రభాతవార్త : పాతనగరం అభివృద్ధి కోసం బిఆర్ఎస్ ఎంతగానో కృషి చేసిందని మాజీ హోం మంత్రి మహ్మద్ మహమూద్ అలీ అన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా తెలంగాణ బెంగాలీ సమితి అధ్యక్షులు దీపాంకర్ పాల్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి మహ్మద్ మహమూద్ అలీని సమితి ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిశారు. మాజీ హోంమంత్రి మహమూద్ అలీని వారు శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు పండుగలను కలిసి మెలిసి జరుపుకుంటున్నారని తెలిపారు. తెలంగాణ బెంగాలీ సమితి అధ్యక్షులు దీపాంకర్ పాల్,ప్రతినిధులు సునీల్ అగర్వాల్,బబ్లూ,మానస పాల్గొన్నారు.

పాతనగరంలో విశాల్ నిశాన్ యాత్ర

సమావేశంలో పాల్గొన్న సంస్థ ప్రతినిధులు మెఘారాణి అగర్వాల్,ఉమేష్ సింగానియా

చార్మినార్,మార్చి 23 ప్రభాతవార్త : హిందూ ధర్మ ప్రేమీ భాగ్యనగర్ ఆధ్వర్యంలో ఏప్రిల్ నెల రెండవ తేదీనశ్రీ హనుమాన్ జన్మదినం సందర్భంగా పాతబస్తీలో విశాల్ నిశాన్ యాత్రను నిర్వహించనున్నామని సంస్థ అధ్యక్షురాలు మేఘా రాణి అగర్వాల్ తెలిపారు. ఘాన్సీ బజార్‌లోని పి.సత్యనారాయణ భవనంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఏప్రిల్ రెండవ తేదీన శ్రీ గోపాల్ మందిరం నుంచి విశాల్ నిశాన్ యాత్ర ప్రారంభమై గుల్జారాహౌస్, ఉర్దూగల్లీ, అగర్వాల్ కళాశాల, మామాజుమ్లా పాఠక్, ఘాన్సీ బజార్, చేలాపుర, బండిఅడ్డ, మిట్టికాషేర్ ప్రాంతాలు మీదుగా మదన్ భవన్ వరకు కొనసాగుతుందని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హిందూ ధర్మ ప్రేమీ భాగ్య నగర్ సంస్థ ప్రతినిధులు ఉమేష్ సింగానియా, చందనా జైన్, కిరణ్ అగర్వాల్ పాల్గొన్నారు.

31న శ్రీ మహావీర్ స్వామి జన్మదినోత్సవ వేడుకలు

సైఫాబాద్, మార్చి 23 ప్రభాతవార్త: శ్రీ మహావీర్ జైన్ సేవా సంఘ్ జయనగర్ ఆధ్వర్యంలో ఈ నెల 31వ తేదీన సికింద్రాబాద్‌లోని ఇంపీరియల్ గార్డెన్‌లో శ్రీ మహావీర్ స్వామి 2625వ జన్మదినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని సంఘ్ ప్రతినిధులు తెలిపారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సేవా సంఘ్ కోర్ కమిటి ప్రతినిధులు ప్రదీప్ సురానా, పరాస్ రాంకా, కిషోర్ ముతా, మహావీర్ టాటెడ్, జయ్‌ప్రకాష్ మాక్నానా తదితరులు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధి కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డితోపాటు అనేక మంది ప్రముఖులు, సాధువులు, ఋషులు పాల్గొంటారని చెప్పారు. ఈ సందర్భంగా ఆదే రోజు ఉదయం సమిత్ గెస్ట్ హౌస్ సమీపంలోని శ్రీ హనుమాన్ దేవాలయం నుంచి మేళా తాళాలు, భజనలు, సంగీత కార్యక్రమాలతో ఊరేగింపు ఇంపీరియల్ గార్డెన్ వరకు కొనసాగుతుందన్నారు. గార్డెన్‌లో భక్తులకు ఏలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

శ్రీరామ నవమి,హనుమత్ జయంతి వేడుకలకు పటిష్టమైన ఏర్పాట్లు : ఈ ఓ శ్రీనివాసశర్మ

బేగంపేట మార్చి 23,ప్రభాతవార్త

సికింద్రాబాద్ ఎస్పీరోడ్ శ్రీవీరహనుమాన్ దేవాలయంలో ఈ నెల 27వ తేదీన శ్రీరామ నవమి,హనుమత్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఈ ఓ శ్రీనివాసశర్మ తెలియజేసారు.ప్రతి ఏడాది లాగానే ఈ ఏడాది కూడా ఆలయంలో వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని రకాలైన ఏర్పాట్లు చేస్తున్నామని,ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామి వారి కృపకు పాత్రులు కావాలని ఈ ఓ తెలియజేసారు.



సికింద్రాబాద్ బోయిన్‌పల్లి హస్మత్ పెట్ చెరువు ఎప్పుడు నీళ్లతో నిండుగా ఉండే చెరువు.. ఇప్పుడు ఈ గుర్రపు డెక్కతో నిండిపోయి ఉంది

ప్రేమ వ్యవహారం.. మనస్థాపంతో ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

జూబ్లీహిల్స్ , మార్చి 23, ప్రభాతవార్తః

ప్రేమ వ్యవహారంలో మనస్థాపానికి గురైన ఇంటర్ విద్యార్థిని బలవన్మరణానికి పాల్పడిన సంఘటన బంజారాహిల్స్ ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్‌లోని దేవరకొండ బస్తీలో నివసించే మహమ్మద్ రేహన్ అలీ(18) ఇటీవలే పరీక్షలు రాశాడు. ఇంట్లోని కుటుంబ సభ్యులు నమాజ్‌కు వెళ్లగా ఇంట్లో ఉన్న రేహన్ అలీ బలవన్మరణానికి పాల్పడ్డాడు. వెంటనే అతన్ని దించి సమీపంలో ఉన్న ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా ప్రేమ వ్యవహారంలోనే తమ కుమారుడు మనస్థాపానికి గురై బలవన్మరణానికి పాల్పడినట్లు తాము అనుమనిస్తున్నామని కుటుంబ సభ్యులు బంజారాహిల్స్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

వీరంగం సృష్టించిన గంజాయి బ్యాచ్

అత్తాపూర్ మార్చి 23, ప్రభాతవార్త :

గంజాయి బ్యాచ్ వీరంగం సృష్టించిన ఘటన అత్తాపూర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.సోమవారం అత్తాపూర్‌లోని ఓ ఇంటి ముందు గంజాయి బ్యాచ్ కూర్చుని దర్జాగా గంజాయి సేవించారు.తమ ఇంటి వద్ద గంజాయి సేవించవద్దని మందలించడంతో ఒక్కసారిగా గంజాయి బ్యాచ్ రేచ్చిపోయి కత్తులతో దాడులకు దిగారు.కత్తితో వీపుపై పోడచండంతో ఓ వ్యక్తికి కత్తి వీపులో దూసుకుపోయి విరిగిపోయింది.అంతటితో ఆగకుండా పెట్రోల్ పోసి ఇంటి దోర్లుకు నిప్పటించి పారిపోయారు. బాధితుల సమాచారంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని సిసి కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

బంధువుల ఇంటికి వెళ్లి వచ్చేసరికి ఇంట్లో చోరీ

అత్తాపూర్ మార్చి 23, ప్రభాతవార్త :

ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు చొరబడి బంగారు ఆభరణాలు,నగదును ఎతుకెళ్లిన ఘటన అత్తాపూర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.పోలీసులు వివరాల ప్రకారం...అత్తాపూర్ పరిధిలోని నౌ నంబర్ జలాల్ బాబా నగర్‌లో ఉండే రియల్ ఎస్టేట్ వ్యాపారి ఫెరోజ్ ఆదివారం రాత్రి ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లారు.ఈ క్రమంలో దొంగలు సోమవారం తెల్లవారుజామున ఫెరోజ్ ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లో చొరబడ్డారు.అల్మారాలోని దాచిన 20లక్షల రూపాయల నగదు,12తులాల బంగారు ఆభరణాలను దోచుకొని ఉండాయించారు.తెల్లవారుజామున తిరిగి ఇంటికి వచ్చిన ఫెరోజ్ ఇంటి తాళం పగలగొట్టి ఉంది.దీంతో ఇంట్లో పరిశీలించగా 20లక్షల నగదు,12తులాల బంగారు ఆభరణాలు చోరి జరిగినట్లు గురించి పోలీసులకు సమాచారం అందించారు.దీంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్ టీమ్‌తో ఆధారాలను సేకరించారు.సిసి కెమెరాలను పరి శీలించగా ఐదుగురు బైక్‌లపై వచ్చి చోరీ చేసినట్లు గురించారు.ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సంతోష్‌నగర్‌లో యువకుడి హత్య..నిందితుల అరెస్టు

సైదాబాద్, మార్చి 23 ప్రభాతవార్త: పాత కక్షల నేపథ్యంలో స్నేహితులే ఒక యువకుడిని దారుణంగా హత్య చేసిన సంఘటన సంతోష్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పూల్‌బాగ్‌కు చెందిన మెకానిక్ పనులు చేసుకునే లయీక్(30)కు అదే ప్రాంతానికి చెందిన సుజ్జుతో గత కొంత కాలంగా విభేదాలు ఉన్నాయి. ఈ క్రమంలో ఆదివారం రాత్రి సుజ్జు, లయీక్ తో పాటు వారి స్నేహితులు సల్మాన్, ఫైజల్, ఆదిల్, ముజ్జు, నఫీజ్ రహ్మాన్‌లు అందరు కలిసి మద్యం సేవించారు. అదే సమయంలో లయీక్‌కు సుజ్జు మధ్య పాత విషయాల గురించి మరోసారి గొడవ తలెత్తింది. సుజ్జు, సల్మాన్, ఫైజల్, ఆదిల్, ముజ్జు, నఫీజ్ రహ్మాన్‌లు లయీక్‌పై దాడి చేసి కత్తులతో పొడిచి దారుణంగా హత్య చేశారు. సమాచారం అందుకున్న సంతోష్‌నగర్ ఎసిపి ఠాకూర్ సుఖ్‌దేవ్ సింగ్, ఇన్‌స్పెక్టర్ కోల సత్యనారాయణలు తమ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తును చేపట్టిన పోలీసులు, నిందితులు ఆరుగురిని అరెస్టు చేశారు.

రౌడీషీటర్ అయుబ్‌ఖాన్ ముగ్గురు కుమారులపై రౌడీషీట్

చాంద్రాయణగుట్ట, మార్చి 23, ప్రభాతవార్త : హత్యాయత్నం కేసులో ప్రమేయం ఉండి పరారీలో ఉన్న ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు సోదరులపై శాలిబండ పోలీసులు రౌడీ షీట్ నమోదు చేశారు. ముగ్గురు రౌడీషీటర్లు పేరు మోసిన రౌడీషీటర్ అయుబ్‌ఖాన్ కుమారులు కావటం గమనార్హం. చార్మినార్ జోన్ డీసీపీ కిరణ్ ప్రభాకర్ ఖరే తెలిపిన వివరాల ప్రకారం... నిందితులు ముగ్గురు పేరు మోసిన రౌడీషీటర్ అయుబ్‌ఖాన్ కుమారులు. వీరికి చట్టవిరుద్ధమైన, హింసాత్మాక కార్యకలాపాలలో పాల్గొన్న చరిత్ర ఉంది. రౌడీషీటర్ అయుబ్‌ఖాన్, అతని కుమారులు షాబా జ్ ఖాన్, అర్బాజ్ ఖాన్, షాహెద్ ఖాన్లను పట్టుకోవటం కోసం గతకొన్ని రోజులుగా పోలీసులు పలు విధాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. వీరి గురించి విశ్వసనీయ సమాచారం అందితే వెంటనే పోలీసుల కు తెలియజేయాలని డీసీపీ కిరణ్ ప్రభాకర్ ఖరే కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచటంతోపాటు తగిన బహుమతి ఇవ్వనున్నట్లు వెల్లడించారు. రౌడీయిజం, వ్యవస్థీకృత నేరాలను ఏ మాత్రం సహించబోమని నగర పోలీసు కమిషనర్ వి.సి.సజ్జనార్ స్పష్టం చేశారు. నిందితులకు సహాయం చేసినా, ఆశ్రయం కల్పించినా సంబందిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

గొప్ప మానవతావాది జస్టిస్ సుభాషణ్‌రెడ్డి

ముషీరాబాద్, మార్చి 23, ప్రభాతవార్త: గొప్ప మానవతావాది జస్టిస్ సుభాసిన్‌రెడ్డి అని పలువురు న్యాయవాద సంఘం నేతలు కొనియాడారు. సోమవారం రంగారెడ్డి జిల్లా కోర్టు, బార్ అసోసియేషన్ హాల్‌లో సుభాసిన్‌రెడ్డి చిత్రపటంతో పాటు 1986 నుంచి 2020 వరకు పనిచేసిన న్యాయవాదుల సంఘం నాయకుల చిత్రపటాలను న్యాయవాదుల సంఘం అధ్యక్షులు ప్రతాప్‌రెడ్డి, కార్యదర్శి బి.కార్తీక్ మరియు ఇతర సభ్యుల ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా జడ్జి ఏ.కరణ్‌కుమార్ చేతుల మీదగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జస్టిస్ సుభాసిన్‌రెడ్డి రంగారెడ్డి జిల్లా వాసిగా, తన న్యాయవాద వృత్తిని ఇక్కడ నుంచే మొదలుపెట్టి, ఏపీ హైకోర్టుకు జడ్జిగా, మద్రాస్ హైకోర్టుకు ఛీఫ్ జస్టిస్‌గా పనిచేశారని గుర్తు చేశారు. ఉమ్మడి ఏపీ రాష్ట్ర మానవ హక్కుల కమీషన్‌కు మొట్టమొదటి ఛైర్మన్‌గా పనిచేసిన సుభాసిన్‌రెడ్డి యువ న్యాయవాదులను ఎంతగానో ప్రోత్సహించేవారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పంచాయితారాజ్ ట్రిబ్యునల్ మాజీ సభ్యులు పులిగారి గోవర్ధన్‌రెడ్డి, మాజీ బార్ కౌన్సిల్ ఛైర్మన్ ఎం.రాజేందర్‌రెడ్డి, హైకోర్టు న్యాయవాది మహేం దర్‌రెడ్డి, మాజీ కార్యదర్శి ఎం.డి.నజీబ్, మాజీ అధ్యక్షులు రఘునందన్‌రెడ్డి, మధుసూదన్, అనంతసేనారెడ్డి, ఏ.మహేష్‌కుమార్, బార్‌కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

జస్టిస్ బి.సుభాసిన్‌రెడ్డి ఫొటోను ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు సంఘం నేతలు

వసంత పంచమి రోజున మహిళల కుంకుమార్చన

చాంద్రాయణగుట్ట, మార్చి 23, ప్రభాతవార్త : పరాభవ నామ సంవత్సరం, చైత్రమాసం యుగాది వసంత నవరాత్రి ఉత్సవాలలో భాగంగా పాతబస్తీ చాంద్రాయణగుట్ట శ్రీ దేవి దేవాలయంలో సోమవారం పంచమిని పురస్కరించుకొని అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ప్రమోద్ కుమార్ కార్వాంకర్ ఆధ్వర్యంలో ఉదయం అభిషేకం, అలంకరణ, హారతి కార్యక్రమాలను చేపట్టారు. మహిళలు అమ్మవారికి భక్తిప్రపత్తులతో సామూహిక కుంకుమార్చన పూజ చేశారు. సాయంత్రం ప్రత్యేక పూజలు, మహా హారతి కార్యక్రమం జరిగింది. సమీప బస్తీల మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని పూజించారు. ఒడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాలలో బుధవారం దుర్గా సప్తశతి హవనం, గురువారం యజ్ఞ పూర్ణాహుతి ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కరుణా కటాక్షాలకు పాత్రులు కావాలని ప్రధాన అర్చకులు ప్రమోద్ కుమార్ కార్వాంకర్ కోరారు. ఈ పూజా కార్యక్రమాలలో ఆలయ అర్చకులు విఠల్ కుమార్ కార్వాంకర్, కపిల్ కార్వాంకర్, సౌరవ్ కార్వాంకర్, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

అమ్మవారికి కుంకుమార్చన పూజను నిర్వహిస్తున్న మహిళలు

మెరుగైన వైద్యానికి ఎల్ఓసీలను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే శ్రీగణేష్

కంటోన్మెంట్,మార్చి 23 ప్రభాతవార్త: అనారోగ్యంతో బాధపడుతున్న పేద ప్రజలు కార్పొరేట్ ఆసుపత్రులలో మెరుగైనవైద్యం అందించేందుకు ముఖ్య మంత్రి సహాయ నిధి ఎంతగానో ఉపయోగపడుతుందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్. శ్రీగణేష్ తెలిపారు. 7వ వార్డు ఓల్డ్ గాంధీ నగర్‌కు చెందిన కె.డెక్రూజ్ సతీమణి లత అనారోగ్యంతో బాధపడుతుంది.నిమ్స్ ఆసుపత్రిలో వైద్యం చేయించుకునేందుకు ప్రభుత్వం నుంచి మంజూరైన 3.50 లక్షల ఎల్ఓసీ మంజూరు పత్రాన్ని సోమవారం పికెట్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రీగణేష్ డెక్రూజ్‌కు అందజేశారు.

మెరుగైన వైద్యానికి 3.50 లక్షల ఎల్ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

రక్తదానం చేసేందుకు యవత ముందుకు రావాలి : ఎమ్మెల్యే తలసాని

ఎమ్మెల్యే తలసానికి జ్ఞాపికను అందజేస్తున్న ఆదయ్య నగర్ యువకులు

అడ్డగుట్ట,మార్చి 23 ప్రభాతవార్త: రక్తదానం చేయడం వలన అత్యవసర పరిస్థితులలో మరొకరికి ప్రాణ దానం చేసినట్లు అవుతుందని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం మోండా డివిజన్ ఆదయ్య నగర్‌లో 18 టెంపుల్స్ హాల్‌లో టీమ్ షాహిద్ భగత్ సింగ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని తలసాని ప్రారంభించారు. ముందుగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రక్తదానం చేసేసిన వారికి సర్టిఫికెట్లు, మెమోంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు తలసాని స్కైలాబ్ యాదవ్,ధర్మేందర్ యాదవ్,నాగులు, నిర్వాహకులు నరేశ్, వంశీ, సాయిచరణ్ తదితరులు పాల్గొన్నారు.

రైల్‌లో గంజాయి తరలిస్తున్న ముఠా అరెస్ట్

10 కిలో గంజాయి స్వాధీనం

రైళ్లలో గంజాయిని తరలిస్తున్న ఇద్దరి నిందితులను అరెస్ట్ చేసిన రైల్వే పోలీసులు, ఆర్.పి.ఎఫ్.పోలీసులు

కంటోన్మెంట్,మార్చి 23 ప్రభాతవార్త: రైళ్లలో గంజాయిని సరఫర చేస్తున్న అంతర్ రాష్ట్ర ముఠాను సికింద్రాబాద్ రైల్వే పోలీసులు,రక్షణ శాఖ దళం, ఈగిల్ బృందాలు అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 5 లక్షల విలువ చేసే 10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని ఇద్దరి నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం ఒడిశా గంగాపూర్ ప్రాంతానికి చెందిన దీపక్ సాహు 26, దీపక్ గౌడ 20, అనే ఇద్దరు యువకులు బరంపుర్ ఒడిశా నుంచి సికింద్రాబాద్ మీదుగా ఢిల్లీకి రైల్‌లో గంజాయిని తరలిస్తుండగా సోమవారం రైల్వే పోలీసులు ఆర్.పి.ఎఫ్. ఈగిల్ బృందాలు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి వారి వద్దనుంచి 10 కిలోల గంజాయిని, 2 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో ఐ.ఆర్.పి.టీ.మాధవ్, ఏ.సుధాకర్ గౌడ్, చంద్రశేఖర్, ఈగిల్ టీమ్ బిక్షపతిరావ్‌లు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిని చికిత్సతో నయం చేయవచ్చు : వైద్యాధికారి మనోజ్‌రెడ్డి

టీబీ పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మనోజ్‌రెడ్డి

ముషీరాబాద్, మార్చి 23, ప్రభాతవార్త: క్షయ వ్యాధిని మొదటి స్థాయిలోనే గుర్తించి, చికిత్స చేయించుకోవటం ద్వారా తేలికగా తగ్గించుకోవచ్చని ముషీరాబాద్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎం.మనోజ్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం క్షయవ్యాధిపై అవగాహన కల్పిస్తూ క్షయవ్యాధిని నిర్మూలన చేయటానికి, ఆ వ్యాధిపై అవగాహన పెంచటానికి ప్రతి సంవత్సరం మార్చి 24న ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవంగా జరుపుకుంటామని తెలిపారు. క్షయ వ్యాధి సోకిన వ్యక్తి దగ్గు, తుమ్ముల ద్వారా వెలువడే తుంపరలు వేరొకరు పీల్చటం ద్వారా వ్యాపించే బాక్టీరియా క్షయవ్యాధి వ్యాప్తి చెందటానికి దోహదపడుతుందని, దీని ప్రభావం ఊపిరితిత్తులతో పాటు శరీరంలోని అన్ని భాగాలపై పడుతుందని అన్నారు. క్షయ వ్యాధి తీవ్రమయ్యే అవకాశం ఉన్న వ్యాధి అయినప్పటికీ సరైన యాంటీ బయోటిక్స్‌తో చికిత్స అందిస్తే దానికి నయం చేయవచ్చునని పేర్కొన్నారు. ప్రపంచంలోని అత్యంత ప్రాణాంతకమైన అంటువ్యాధులలో ఒకటైన క్షయ వ్యాధికి అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచితంగా పరీక్షలు, మందులు అందిస్తున్నారని తెలిపారు. క్షయ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండి, ఆ వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించి, తగిన పరీక్షలు చేయించుకుని, వైద్యుల సలహా ప్రకారం మందులు వాడటం ద్వారా క్షయ వ్యాధినుంచి పూర్తిగా బయటపడవచ్చునని వివరించారు.

నేటి యువత భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి : లడ్డుయాదవ్

అన్నదానం చేస్తున్న భగత్‌సింగ్ యువసేనా అధ్యక్షులు లడ్డుయాదవ్

అప్పల్‌గండ్,మార్చి23 ప్రభాతవార్త: నేటి యువత భగత్‌సింగ్ అడుగుజాడల్లో నడువాలని భగత్‌సింగ్ యువసేనా అధ్యక్షులు లడ్డుయాదవ్ పిలుపునిచ్చారు.ముస్లింజంగ్‌పూల్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భగత్‌సింగ్ బలిదానం దినోత్సవాన్ని పురస్కరించుకుని భగత్‌సింగ్ విగ్రహానికి ఆమె పూలమాలలు వేసి నివాళ్లు ఆర్పించారు. నిరుపేదలకు అన్నదానం చేశారు. ఈకార్య క్రమంలోముఖన్‌యాదవ్,జగదీష్‌యాదవ్, రాజేందర్‌జాహిడి,కన్నయ ఉపాధ్య, మోనాసింగ్,సొరబ్‌యాదవ్‌తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ ముట్టడికి వెళ్లిన బిజెపి నాయకులను అడ్డగించిన పోలీసులు

ఎస్సీ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓంప్రకాష్‌బిస్వాను అరెస్ట్ చేసిన పోలీసులు

గన్‌ఫౌండ్రి,మార్చి 23 ప్రభాతవార్త: భారతీయ జనతా పార్టీ కమిటి అధ్యక్షులు రామచంద్రరావు నేతృత్వంలో సోమవారం ఇచ్చిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి బయలు దేరిన గోషామహల్‌నియోజకవర్గం బిజెపి నాయకులను పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకుని ఆయా పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఎస్సీ సెల్ బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓం ప్రకాష్‌బిస్వా,బిజెపి నాయకులు అసెంబ్లీ ముట్టడికి బయలు దేరుతుండగా పోలీసులు అడ్డుకుని అబిడ్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలతో పాటు రిటైర్డ్ అయిన వివిధ విభాగాలకు చెందిన అధికారులు ,సిబ్బందికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ వెంటనే అందచేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలోతదితరులు పాల్గొన్నారు.కాగా జాంబాగ్ డివిజన్ బిజెపి మాజీ కార్పొరేటర్ రాకేష్‌జైస్వాల్, వికారాబాద్ జిల్లా మాజీ అధ్యక్షులు, రాష్ట్ర బిజెపి మెడికల్ సెల్ కన్వీనర్ డాక్టర్‌కొప్పుల రాజశేఖరరెడ్డిని అరెస్ట్ చేసి బేగంబజార్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.ముందు జాగ్రత్తచర్యగా పలు ప్రాంతాల్లో బిజెపి నాయకులను అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు అప్రమత్తంగా ఆయా ప్రాంతాల్లో నిఘా వేసి ఉంచడం కనిపించింది.

CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, VURAKARANAM SAMBA SHIVA SHARMA, S/O VURAKARANAM SUBBA RAO , R/O My City Residency, F.No-G7, P.No-18,19&20, Sri Sai Nagar, Bachupally, Medchal Malkajgiri Dist. Hyderabad, T.S. Changed my son name as VURAKARANAM MURALI VARSHITH with immediate effect. (Ro.No.068769)

★ I, VURAKARANAM SAMBA SHIVA SHARMA, S/O VURAKARANAM SUBBA RAO, R/O My City Residency, F.No-G7, P.No-18,19&20, Sri Sai Nagar, Bachupally, Medchal Malkajgiri Dist. Hyderabad, T.S. Changed my daughter name as VURAKARANAM JAITHYA KRUTHI with immediate effect. (Ro.No.068769)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

PUBLIC NOTICE

Notice is hereby given that the original Simple Mortgage Deed (Doc No. 7736/2024) and Memorandum of Deposit of Title Deed (Doc No. 1756/2010), both registered at SRO Serilingam pally, have been lost during transit on 25-2-2026 around 12 p.m . The documents pertain to Plot No. 1035, MIG, Nallagandla Village, Serilingampally Mandal, R.R. District, owned by Sri Pisati Mallikarjun Reddy, S/o P. Sathi Reddy. Anyone finding these documents is requested to return them to the undersigned and a reward will be offered for their safe return. Please note that any unauthorized use or possession of these documents will lead to legal action.

SD/- B.V.L SAILAJA
ADVOCATE
Flat no: 402,
Plot No: 823 & 824,
Sai Thertha Nilayam,
Mathrusri Nagar,
Miyapur,
Cell: 9030045868

PUBLIC NOTICE

It is to inform that my client **M/s. Sree Gokulam Chits & Finance Co. (P) LTD,** Rep. by its Authorised Signatory AGM Prasanth N U who are in the business of chits and was approached by M/s. M.N. Enterprises Rep. by Mr. Kondal Rao and Mr. Gopala Krishna B who subscribed 6 Nos of chits for a tenure of 20 months That, both **M/s. M.N. Enterprises Rep. by Mr. Kondal Rao and Mr. B. Gopala Krishna** lifted the chits and towards security offered the following properties i.e., 1.All that Open Place ad measuring 600 Sq. Yards or 501.6 Sq.Meters, in Sy.Nos.450/2/A and 451, situated at Village and Gram-Panchayat, Devar Yamjal, Shamirpet Mandal, Medchal-Malkajgiri District vide Regd. Sale Deed No.2196/2019 dated 06.03.2019 belonging to one **Smt. C.S. Kavya W/o. B. Gopala Krishna** and
2. All that Plot No.16 & 17, in Sy. No.29, admeasuring 400 Sq. Yards or 334.4 Sq. Meters, situated at Kowkur Village, Alwal Municipality, R.R.District vide Regd. Sale Deed No.167/1994 dated 11.01.1994 belong to **Sri. B. Kondal Rao.**
That, the outstanding dues of M/s. M.N. Enterprises Rep. by Mr.Kondal Rao B and Mr. B. Gopala Krishna is about Rs.91,84,850/- (Rupees Ninty One Lakhs Eighty Four Thousand and Eight Hundred and Fifty Only) and the company has initiated appropriate recovery proceedings against the above said property.
The General Public, banks, financial institutions, corporate, NBFCs etc., is hereby cautioned not to deal with the above said properties or persons as the originals of the said properties are kept in the custody of my client to secure the defaulters liability and any person/s dealing with the said property will be doing so at their own risk.

SUJIT SASIDHARRN
Advocate
Flat No.101, 1st Floor, Olive Homes, 1-17-17/45, Dr. A.S. Raonagar, ECIL Post, Hyderabad-500 062. #9848429029

IN THE COURT OF THE HON'BLE II SENIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT HYDERABAD

E.A.No. 47 of 2025
IN
O.S. No. 455 of 2013

Between:
Smt. Renu Agarwal, W/o Narendra Kumar Agarwal, aged about 51 years, Occ: Business, R/o. Flat No. 101, Rock Levelz Apartment, Road No.12, Banjara Hills, Hyderabad-500034

...DECREE HOLDER

And

Mr. Banda Rajendar Yadav, S/o Late Banda Narayan Yadav, aged: Unknown, R/o 10-1-326, Chintal Basti, Khairatabad, Hyderabad-500004.
Mr. Banda Ashok Kumar Yadav, S/o Late Banda Narayan Yadav. aged: Unknown, R/o 10-1-326, Chintal Basti, Khairatabad, Hyderabad-500004
Mr. Banda Naresh Yadav, S/o Late Banda Narayan Yadav, aged: Unknown, R/o 10-1-326, Chintal Basti, Khairatabad, Hyderabad-500004

...JUDGMENT DEBTOR

Sir,

Please take notice that my client, Mrs. Renu Agarwal has instituted Execution Proceedings in **O.S.No. 455 of 2013 vide E.A.No. 47 of 2025** before the Hon'ble II Senior Civil Judge, City Civil Court, Hyderabad.

As per the directions of the Hon'ble Court, you are hereby required to appear before the said Court on **13.04.2026.** Kindly note that if you fail to appear on the scheduled date, the matter will proceed exparte and be decided on the merits in your absence.

(BY ORDER OF THE COURT)
Sd/- Ishika Bangaru
Advocate
Street No. 3, Himayat Nagar,
Hyderabad-500029
Mobile: +91 9000599211,
email: ishikabangaru1060@gmail.com

తెలంగాణ ప్రభుత్వం
సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్
EE-II (56-కొంపల్లి, 59-దుండిగల్ & 60-మేడ్చల్), కుత్బుల్లాపూర్ జోన్

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన

నిట్ నం. 06/EE-56/QBZ/CMC/2025-26 & నిట్ నం. 05/EE-60/QBZ/CMC/2025-26, తేది: 23.03.2026.
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంపై ప్రచురించబడింది. వివరాలను https://tender.eprocurement.gov.in లాగిన్ అవటం ద్వారా చూడవచ్చును. తేదీల వివరాలు క్రింద వివరించబడినవి. **నిట్ నం.** పైన పేర్కొన్నది. **పని పేరు:** 1) వార్షిక పూడికతీత-1 పని. 2) పెయింటింగ్ మరియు నేమ్ బోర్డుల ఫిక్సింగ్-1 పని. 3) UGD లైన్ వేయుట-1 పని. అంచనా మొత్తం లక్షలలో: 33.56 నిట్ నం. పైన పేర్కొన్నది. పని పేరు: వార్షిక పూడికతీత 2 పనులు. అంచనా మొత్తం రూ.లక్షలలో: 24.50. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ & సమయం/బిడ్ దాఖలు మొగింపు తేదీ & సమయం: బిడ్(1) & (2) కొరకు: 24.03.2026 మ.12.00 గం. నుండి 30.03.2026 మ.12.00 గం. వరకు. బిడ్(3) కొరకు: 25.03.2026 మ.12.00 గం. నుండి 01.04.2026 మ.12.00 గం. వరకు. 2) బిడ్(1) కొరకు (2 పనులు) 24.03.2026 మ.12.00 గం. నుండి 30.03.2026 మ.12.00 గం. వరకు. **అధికారి పేరు & చిరునామా:** సెల్ నం: EE, నర్సరీ 56, 59 & 60, CMC కుత్బుల్లాపూర్, సెల్ నం: 7995468066/7331181426. **సంబంధిత అధికారి చిరునామా:** శ్రీ సుబ్రమణ్య SVRNRD, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, 59-కొంపల్లి, 60-దుండిగల్ & 60-మేడ్చల్, కుత్బుల్లాపూర్ జోన్, CMC. తరువరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ https://tender.telangana.gov.in వద్ద చూడవచ్చును. **సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, నర్సరీ-56, 59 & 60, QBZ, CMC**
DIPR.No.17476-PP/CL/Advt/1/2025-26, తేది: 23.03.2026



భగత్‌సింగ్, సుఖ్‌దేవ్‌లకు ఘన నివాళులు

భగత్‌సింగ్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

హుడాకాంప్లెక్స్ మార్చి23, ప్రభాతవార్త : సరూర్‌నగర్ డివిజన్ లో సిపిఐ భగత్‌సింగ్‌నగర్ శాఖ అధ్వర్యంలో విప్లవ స్వాతంత్ర సమరయోధులైన భగత్‌సింగ్, సుఖ్‌దేవ్‌ల 95వ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యుడు బాతరాజు నర్సింహ హాజరై భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాలులర్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే భారత స్వాతంత్ర ఉద్యమానికి స్వాతంత్ర జ్వాలలను తమ మనసు నిండ నింపు కొని స్వాతంత్ర ఉద్యమం వైపు అకర్షితులై భారతదేశ స్వతంత్ర సంగ్రామం వైపు అడుగులు వేశారని అన్నారు. భారతదేశ స్వాతంత్ర పోరాటానికి షోషలిజాన్ని జోడించి స్వేచ్ఛ, సమానత్వం, సార్వభౌమత్వంతో పాటు ఎలాంటి దోపిడి, పీడన లేని స్వాతంత్రానికై భగత్‌సింగ్, సుఖ్‌దేవ్‌లు తమ విలువైన ప్రాణాలను తునప్రాయంగా వదులుకున్నారని అన్నారు. నేటి యువతీ, యువకులు వారి అశయ సాధన కోసం ముందుం దాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ప్రవీణ్‌కుమార్, అర్.గోపాల్, జిల్లల క్రిష్టా, ఎండి.మహబూబ్, సొహెద్, అమీద్ , పరుశరాం తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామనవమి మహోత్సవాలను పురస్కరించుకుని ఆధ్యాత్మిక కార్యక్రమాలు : రమేష్ రాజ్

ఎపిఎయు కాలనీలో శ్రీరామ పాదుకా పట్టాభిషేకం నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు తదితరులు

మలక్ పేట, మార్చ్ 23, ప్రభాతవార్త: ఆస్మాన్ ఘాడ్ డివిజన్ ఏపీఎయు కాలనీలోని ధర్మ నిలయంలో శ్రీరామ నవమి మహోత్సవాలను పురస్కరించుకుని పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి ఖమ్మం కు చెందిన సుమిత్ర యూత్ అసోసియేషన్ బృందం ప్రదర్శించిన శ్రీరామ పాదుక పట్టాభిషేకం నాటకం అందరినీ ఎంతగానో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఉత్సవ నిర్వాహకులు, స్వాధిష్ఠ సేవా సమితి ప్రతినిధులు ఆర్. రమేష్ రాజు, నవీన్ పటాలే మడిగెల విజయభాస్కర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డిలు మాట్లాడుతూ శ్రీరామనవమి మహోత్సవాలలో భాగంగాఉగాది నుండీ శ్రీరామనవమి వరకు ఎపిఎయు కాలనీ ధర్మ నిలయములోని అమ్మ గారి నిలయం లో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. గత 46 సంవత్సరాలుగా కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు, భక్తులు భక్తిశ్రద్ధలతో శ్రీరామ నవరాత్రి మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నామని వివరించారు .ఉత్సవాలను పురస్కరించుకుని ప్రతినిత్యము పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా 24వ తేదీ మంగళవారం సాయంత్రం వీర అభిమన్యుడు బుర్రకథ, 25వ తేదీ సాయంత్రం భక్తి గానాలహరి కార్యక్రమం, 26వ తేదీ గురువారం సాయంత్రం ఎదురుకోలు, 27వ తేదీ శుక్రవారం శ్రీ సీతారామ కళ్యాణం తదితర కార్యక్రమాలను నిర్వహించనునట్లు తెలిపారు. శ్రీరామ నవమి మహోత్సవాలను పురస్కరించుకుని ప్రతిరోజు ధర్మనిలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కావున భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

భగత్ సింగ్, రాజ్ గురు,సుఖ్ దేవ్‌ల త్యాగాలు చిరస్మరణీయం

తుర్కయంజాల్, మార్చి 23,ప్రభాతవార్త

ఆదిభట్ల సర్కిల్ తుర్కయంజాల్ డివిజన్ పరిధిలో అఖిలభారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో బ్రాహ్మణపల్లి రోడ్డులోని భగత్ సింగ్ చౌరస్తా వద్ద షహీద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల 95వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు అమర వీరుల విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ...దేశ స్వాతంత్రం కోసం ప్రాణాలను పణంగా పెట్టి ఉరికొయ్యలను సైతం లెక్కచేయకుండా బ్రిటిష్ వలస పాలకులపై వీరోచితంగా పోరాడిన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు.ఈ కార్యక్రమాల్లో క్రికెట్, కబడ్డీ, వాలీబాల్ పోటీలు, వ్యాసరచన, చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలు, రక్తదాన శిబిరాలు, యువ కవులగాయకుల సమ్మేళనం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పి. శివకుమార్ , ఏఐవైఎఫ్ జిల్లా మాజీ నాయకుడు కాటం రాజు ,ఏఐవైఎఫ్ నాయకులు శ్రీకాంత్, కుంచపు శివ, వివేక్, గణేష్, గండికోట శివ, అజయ్, ప్రసాద్, నరసింహ, సుందరమ్మ, మణెమ్మ, సయ్యద్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

జన జాగరణ జాతర విజయవంతనికి గాయకుడు చంద్రహాస్ మద్దతు

కటకం నర్సింగరావు కలిసిన గాయకుడు, నటుడు చంద్రహాస్

ఎల్.బి.నగర్, మార్చి 23 ప్రభాతవార్త: మన ఆలోచన సాధన సమితి (మాస్)వ్యవస్థాపక అధ్యక్షులు కటకం నర్సింగరావు నివాసంలో తెలంగాణ ప్రజా గాయకుడు, సినిమా నటుడు ఇప్పలపల్లి చంద్రహాస్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఏప్రిల్ 19న నగరంలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించే జనజాగరణ జాతర కార్యక్రమానికి తన పూర్తి మద్దతు ఇస్తున్నట్లు చంద్రహాస్ ప్రకటించారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించేందుకు కృషి చేస్తానని చంద్రహాస్ తెలిపారు. కార్యక్రమ విజయవంతం కోసం రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నాయకులతో ఎప్పటికప్పుడు చర్చలు జరుపుతున్నామని నర్సింగరావు తెలిపారు. రాష్ట్రం నలుమూలల నుంచి పెద్దఎత్తున వచ్చేవారికోసం అవసరమైన వసతులు కూడా కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాస్ రాష్ట్ర కార్యదర్శి గుణగంటి చంద్రశేఖర్‌గౌడ్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి పెద్దవూర బ్రహ్మయ్య, సోషల్ మీడియా కార్యదర్శి కైరంకొండ నర్సింగ్‌గంగపుత్ర, కటకం సుప్రియ, మామిడి సతీష్, అనగంటి విష్ణు, విజయ్‌తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి : ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్

మలక్ పేట, మార్చ్ 23, ప్రభాతవార్త: కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తుందని ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ పేర్కొన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ సోహైల్ ఆధ్వర్యంలో ముసారాంబాగ్ లోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన ఈద్ మిలాప్ కార్యక్రమానికి ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్, మలక్ పేట ఇన్ స్పెక్టర్ పిడమర్తి నరేష్ తదితరులు విచ్చేసి సోహైల్ కు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అదే విధంగా సోహెల్ ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్, ఇన్ స్పెక్టర్ పిడమర్తి నరేష్ తదితరులను శాలువాలతో ఘనంగా సన్మానించి పుష్ప గుచ్చాలను అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ మాట్లాడుతూ రంజాన్ పండుగ మతసామరస్యానికి ప్రతీక గా నిలుస్తుందని తెలిపారు.పండుగలు, సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి పండుగలను నిర్వహించుకోవడంతో మతసామరస్యం పెంపొందుతుందని పేర్కొన్నారు. ప్రజలందరూ ఉత్సవాలను కలిసిమెలిసి శాంతియుత వాతావరణంలో, ప్రశాంతంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ ఐక్యతగా ఉండి అభివృద్ధి చెందాలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఎన్ఎస్ యుఐ రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ సోహైల్ మాట్లాడుతూ పండుగలు ఆత్మీయత, సోదర భావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. ప్రతి సంవత్సరం ఈద్ మిలాప్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి వారిని చైతన్య పరుస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్, మలక్ పేట ఇన్ స్పెక్టర్ పిడమర్తి నరేష్ లను శాలువాలతో ఘనంగా సన్మానించి పుష్ప గుచ్చాలను అందజేస్తున్న మహమ్మద్ సోహైల్ తదితరులు

మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వ్యక్తిత్వ వికాస శిక్షణ

నేరెడ్ మెట్ మార్చి 23,ప్రభాతవార్త : విద్యార్థుల సమగ్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వ్యక్తిత్వ వికాస శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉపాధి అవకాశాల విభాగం, వృత్తి మార్గదర్శక విభాగం ఆధ్వర్యంలో డా. ఎస్. రాజేశ్ కుమార్ నిర్వహించినట్లు ఉప ప్రధానాచార్యులు అడవి రాజు తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, సమాజంలో ఉన్నత స్థానం సాధించేందుకు సానుకూల దృక్పథం అవసరమని సూచించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రేరణాత్మక వక్త శశాంక్ పాలోజు విద్యార్థులను ఉత్తేజపరిచేలా ప్రసంగించారు. జీవితంలో సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం విజయానికి తొలి అడుగని పేర్కొన్నారు. కల, కోరిక, లక్ష్యం మధ్య తేడాను వివరిస్తూ కల తాత్కాలిక ఆలోచన మాత్రమే, కోరిక దానిని సాధించాలనే ఆసక్తి, లక్ష్యం మాత్రం స్పష్టమైన ప్రణాళికతో ముందుకు నడిపించే దిశ అని తెలిపారు.ప్రేరణ, ఉత్సాహం, లక్ష్యం ఈ మూడు పరస్పరం అనుసంధానమై విజయానికి దారి తీస్తాయని, వ్యక్తిత్వ వికాసానికి క్రమశిక్షణ, పట్టుదల, సానుకూల దృక్పథం కీలకమని వివరించారు. ఈ సందర్భంగా ప్రముఖ మహిళా క్రీడాకారిణి అరుణిమా సిన్హా జీవిత గాథను ఉదాహరణగా చూపిస్తూ ప్రతికూల పరిస్థితుల్లో కూడా ధైర్యంతో ముందుకు సాగితే అసాధ్యాన్ని సాధ్యంగా మార్చుకోవచ్చని పేర్కొన్నారు.కార్యక్రమ నిర్వాహకులు డా. ఎస్. రాజేశ్ కుమార్ మాట్లాడుతూ ఇటువంటి శిక్షణలు విద్యార్థుల భవిష్యత్‌కు దిశానిర్దేశం చేస్తాయని తెలిపారు. బాధ్యతలు నిర్వహిస్తున్న ప్రధానాచార్యులు గుణాకర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో ఇటువంటి కార్యక్రమాలు ముఖ్యపాత్ర పోషిస్తాయని అన్నారు. హిందీ ఉపాధ్యాయుడు జగన్ క్రమశిక్షణ, కష్టపడే అలవాటు విజయానికి మూలమని వివరించారు.చివరిగా విద్యార్థులతో ప్రశ్నోత్తర కార్యక్రమం నిర్వహించగా వారు ఆసక్తిగా పాల్గొని సందేహాలను నివృత్తి చేసుకున్నారు. సమన్వయ బాధ్యతలను శైలజ నిర్వహించగా, కృతజ్ఞతలను పొన్నాల అరుణ తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున విద్యార్థులు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

చర్చికాలనీలో డ్రైనేజీ నిర్మాణంలో నిర్లక్ష్యంపై ఎండికి ఫిర్యాదు

ఉప్పల్, మార్చి 23 ప్రభాతవార్త : ఉప్పల్ డివిజన్ చర్చి కాలనీలో అభివృద్ధి పనుల విషయంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ ఎం.రజితరెడ్డిలుపేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం పలువురు అధికారులతో కలిసి పనులను పరిశీలించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ చర్చికాలనీలో చేపడుతున్న పనులపై తగు చర్యలు తీసుకోవాలని జలమండలి ఎండి అశోక్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఉప్పల్ డివిజన్‌లోని చర్చి కాలనీలో నిధులు మంజూరైనప్పటికి డ్రైనేజీ నిర్మాణ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ సకాలంలో పనులు చేపట్టలేదన్నారు. డ్రైనేజీ నిర్మాణ పనులు ఇంకా చేపట్టలేదని ఫిర్యాదు చేశారు. పనులు చేపట్టని కాంట్రాక్టు సంస్థ పేరును బ్లాక్ లిస్టులో పెట్టాలని పరమేశ్వర్ రెడ్డి కోరారు. తక్షణమే ఆ పని చేయనున్నట్టుగా ఎండి అశోక్ రెడ్డి హామీ ఇచ్చినట్లు తెలిపారు. త్వరలోనే అధికారుల బృందం చర్చి కాలనీని సందర్శనుందని తెలిపారు. అధికారి పంకజ ఆధ్వర్యంలో చర్చి కాలనీలో వాటర్ వర్క్స్ అధికారుల బృందం సందర్శించనుందని, తక్షణమే డ్రైనేజీ నిర్మాణ పనులను చేపట్టేందుకు కావాల్సిన చర్యలు చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో చర్చి కాలనీ అధ్యక్షులు జాన్ విల్సన్, పోలిశెట్టి సుధాకర్, రత్న రెడ్డి, సతీష్, డేవిడ్, వినోద్, లుకాస్, లుర్ద్ రెడ్డి, భాస్కర్, సందీప్, వినయ్, కిరణ్, రాజు, రాయన్న ,మేరీ, సుమలత రెడ్డి, వినాశమ్మ, రోస్ మేరి, పుష్పాలమ్మ, లూకాస్, లక్ష్మ రెడ్డి, శామ్యూల్, బాలస్వామి, వినోద్, జై రాజ్ తదితరులు పాల్గొన్నారు.

చర్చికాలనీలో డ్రైనేజీ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్ ఎం.రజిత పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

అభివృద్ధి పనులపై కలెక్టర్‌కు వినతి

మల్కాజ్‌గిరి మార్చి 23,ప్రభాతవార్త : మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ మాను చౌదరిని మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సంబంధిత సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని వినతి పత్రాలు సమర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎమ్మెల్యే ప్రతిపాదించిన అంశాలపై సానుకూలంగా స్పందించి, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, సంబంధిత కాలనీల ప్రజలు, బస్తీ వాసులు పాల్గొన్నారు.

ఉప్పల్‌లో బిజెపి నేతల ముందస్తు అరెస్ట్

మాజీ కార్పొరేటర్ బండారు శ్రీవాణిని ముందస్తు అరెస్ట్ చేసిన పోలీసులు దృశ్యం.

రామంతాపూర్, మార్చి 23 ప్రభాతవార్త : అసెంబ్లీ ముట్టడికి తరలివెళుతున్న పలువురు బిజెపి నేతలను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. రామంతాపూర్ మాజీ కార్పొరేటర్ బండారు శ్రీవాణి, ఉప్పల్ బిజెపి సీనియర్ నేతలు రెడ్డి గారి దేవేందర్‌రెడ్డి, సింగారం కార్తీక్, తెలంగాణ సంపత్, సోమశేఖర్‌గౌడ్, తీగ విఠల్‌రావు, దువ్వాల రమేష్, నామ శ్రవణ్, హబ్సిగూడ బిజెపి నేతలు చెల్లోజు ఎల్లాచారి, పి. అశోక్ తదితరులను అరెస్ట్ చేసి సాయంత్రం వదిలిపెట్టారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గ్రుత ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై పోరాటం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో పలువురు బిజెపి నేతలు పాల్గొన్నారు.

కేటీఆర్‌కు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తున్నా బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మునావర్ ఖాన్, చిత్రంలో మాజీ మంత్రి మహామూద్ అలీ తదితరులు

అసెంబ్లీ ముట్టడికి వెళ్లిన బిజెపి నేతల అరెస్ట్

అసెంబ్లీ ముట్టడికి తరలివెళ్లిన బిజెపి డివిజన్ అధ్యక్షుడు మార్నెని పణీందర్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు దృశ్యం.

ఉప్పల్, మార్చి 23 ప్రభాతవార్త : ఉప్పల్‌లో పోలీసులను తప్పించుకుని అసెంబ్లీ వద్దకు వెళ్లిన బిజెపి డివిజన్ అధ్యక్షుడు మార్నెని పణీందర్‌తో సహా పలువురు నేతలు పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం వారిని పలు పోలీస్‌స్టేషన్‌లలో ఉంచి సాయంత్రం వదిలిపెట్టారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో మార్నెని పణీందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలం అయ్యిందన్నారు. రాబోయే రోజుల్లో వారికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు బిజెపి నేతలు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేత

అత్తాపూర్ మార్చి23,ప్రభాతవార్త : అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని హైదర్ గూడ డివిజన్ పరమారెడ్డి హిల్స్ ఫేజ్ 2లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారులు సోమవారం చర్యలు చేపట్టారు. అనుమతులు ఒక విధంగా తీసుకుని నిర్మాణాలు వేరే విధంగా చేపడుతున్న మూడు భవనాలను కూల్చివేయగా, మరో రెండు భవనాలను సీజ్ చేశారు.స్థానికుల ఫిర్యాదు మేరకు అధికారులు తనిఖీలు నిర్వహించి, స్టిల్ట్ ప్లస్ టు అనుమతులు తీసుకుని స్టిల్ట్ ప్లస్ ఫోర్‌తో పాటు పెంట్ హౌస్ నిర్మిస్తున్నట్లు గుర్తించారు. దీంతో వెంటనే కూల్చివేత చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా అత్తాపూర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ సుధాకర్ మాట్లాడుతూ, జోనల్ కమిషనర్ మరియు డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు అక్రమ నిర్మాణాలను తొలగించినట్లు తెలిపారు. భవన నిర్మాణాలు చేపట్టే వారు తప్పనిసరిగా నిబంధనలకు అనుగుణంగా నిర్మించుకోవాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.కూల్చివేతలలో సెక్షన్ ఆఫీసర్ విశాల్ రెడ్డి, చైన్ మెన్‌లు సతీష్, బాల్ రాజు, నాక్ ఇంజనీర్ స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట బిజెపి నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

పోలీసుల అదుపులో జంగారెడ్డి, ఇతర బిజెపి నాయకులు

ఎల్.బి.నగర్, మార్చి 23 ప్రభాతవార్త: బీజేపీ రాష్ట్ర పిలుపు మేరకు నిర్వహించిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని అడ్డుకోవడంలో భాగంగా పోలీసులు ముందస్తు చర్యగా బిజెపి నాయకులను అదుపులోకి తీసుకున్నారు. కొత్తపేట డివిజన్ బీజేపీ నాయకులను, కార్యకర్తలను సోమవారం పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు.ఈ ఘటనపై బీజేపీ రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి ఎలిమినేటి జంగారెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్య హక్కులను అణచివేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఇలాంటి చర్యలు ప్రజల స్వరాన్ని అణచలేవని, భవిష్యత్తులో మరింత బలంగా పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి డివిజన్ అధ్యక్షులు రాజేష్‌కుమార్, జిల్లా నాయకులు వగ్గుల సుందర్‌నారాయణ, కాసర్ల వెంకట్‌రెడ్డి, కొత్త తిరుమల, ప్రధానకార్యదర్శి గట్టు మహేష్ కుమార్, బీజేవైఎం నాయకులు కొమ్ము శివ, శరణ్ తదితరులను అరెస్టు చేసి చైతన్యపురి పోలీస్ స్టేషన్ కు తరలించారు.

భగత్ సింగ్‌కు ఘన నివాళులు

నేరేడ్ మెట్, మార్చి 23,ప్రభాతవార్త : స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా నేరేడ్ మెట్‌లోని భగత్ సింగ్ నగర్‌లో సోమవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షులు సానాది శంకర్ ఆధ్వర్యంలో భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన త్యాగస్ఫూర్తిని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భగత్ సింగ్ దేశభక్తి, త్యాగం యువతకు మార్గదర్శకమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సవుళ్ల శ్రీనివాస్, ఎల్. కృష్ణయ్య, బాల నరసింహ లింగం, రాజు సత్యనారాయణ, శివ కుమార్, సాయి గౌడ్, బాలకృష్ణ గౌడ్, జయమ్మ, రాజ్యలక్ష్మి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదుల స్వీకరణ

జోనల్ కమిషనర్ రాధిక గుప్తాకు వినతి పత్రం అందజేస్తున్న స్వరూప్‌రెడ్డి కాలనీ నేతలు

ఉప్పల్, మార్చి 23 ప్రభాతవార్త : మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని ఉప్పల్ జోనల్ పరిధిలో సోమవారం జోనల్ కమిషనర్ రాధిక గుప్తా ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి పలు ఫిర్యాదులు స్వీకరించారు. ఉప్పల్ డివిజన్‌లో స్వరూప్ రెడ్డి కాలనీ అధ్యక్షుడు పంగ మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో జోనల్ కమిషనర్ రాధిక గుప్తాను కలిసి పలు సమస్యలు పిర్యాదు చేశారు. కాలనీలో రోడ్లపై చెత్తాచెదారం వేస్తున్నారని, పారిశుధ్య నిర్వహణ చేయడం లేదని ఫిర్యాదు చేశారు. దీనిపై కమిషనర్ వెంటనే స్పందించి సంబంధిత అధికారులను తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదే విధంగా టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, ఇంజనీరింగ్ తదితర విభాగల నుంచి కూడా ఫిర్యాదులు స్వీకరించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు అన్న వెంకటేష్, జ్ఞానేశ్వర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కుర్తాళం పీఠాధిపతిని దర్శించుకున్న ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్

కుర్తాళం కుర్తాళం పీఠాధిపతి శ్రీ దత్తేశ్వరానంద భారతి స్వామి ఆశ్వీరచం తీసుకున్న మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ తదితరులు

ఉప్పల్, మార్చి 23 ప్రభాతవార్త : తమిళనాడు రాష్ట్రంలోని కుర్తాళం పీఠాధిపతి శ్రీ దత్తేశ్వరానంద భారతి స్వామిని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ సోమవారం దర్శించుకుని ఆయన ఆశ్వీరచము తీసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ మాట్లాడుతూ స్వామి వారి దయతో ఉప్పల్ నియోజకవర్గం ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఐదు రాష్ట్రాలలో బిజెపి ఘన విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు బిజెపి నేతలు పాల్గొన్నారు.

బిజెపి నాయకులు జంగం మధుకర్‌రెడ్డి అరెస్టు

మధుకర్‌రెడ్డిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

సైదాబాద్, మార్చి 23 ప్రభాతవార్త: బిజెపి అధిష్టానం పిలుపు మేరకు బిజెపి సీనియర్ నాయకులు జంగం మధుకర్‌రెడ్డి సోమవారం అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో పాల్గొన్నారు. పోలీసులు మధుకర్‌రెడ్డిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా స్వామ్య యుతంగా నిరసన తెలపడానికి వెళ్తున్న తమను అరెస్టు చేయడం దుర్మార్గమని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందన్నారు. పాలనను గాలికి వదిలేసిన కాంగ్రెస్ నాయకులు తమ జేబులు నింపుకునే పనిలో ఉన్నారని ఆయన విమర్శించారు.

కేటీఆర్‌కు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తున్నా చావుని డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు హయత్ హుస్సేన్ హబీబ్, చిత్రంలో నాయకులు ఆజాం అలీ, తదితరులు

అలరించిన శయన దృశ్య ఘట్టం

చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న కళాభారతి ప్రతినిధులు.

వనస్థలిపురం. మార్చి.23.ప్రభాతవార్త

వసంత నవరాత్రుల సందర్భంగా హయత్ నగర్ డివిజన్ పరిధిలోని శారదా నగర్ లో గల శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో కళాభారతి సాహితీ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో చిలకళపూడి శ్రీ వృంద నృత్య ప్రదర్శన శ్రీ కృష్ణ రాయబారం నాటకం నుండి శయన దృశ్య ఘట్టం ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది.శ్రీకృష్ణుడు మల్లాది వెంకటరమణ, దుర్యోధనుడు వెంకటేశం,అర్జునుడు గా ప్రసన్న ఆంజనేయులు నటించారు ఈ కార్యక్రమంలో కళాభారతి కన్వీనర్ కొప్పోలు జగన్నాధ రావు,తంగిరాల అరుణ్ కుమార్,కె.ఎల్.నర్సింహ రావు తదితరులు పాల్గొన్నారు.

గుడ్ల పంపిణీపై గరికపాటి వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి : యాదిగిరి

ఎల్.బి.నగర్, మార్చి 22 ప్రభాతవార్త: పేద విద్యార్థుల సంక్షేమానికి సంబంధించిన అత్యంత కీలకమైన మధ్యాహ్న భోజన పథకం, గుడ్ల పంపిణీపై గరికపాటి నరసింహరావు చేసిన వ్యాఖ్యలను బహుజన సంఘర్షణ సమితి తీవ్రంగా ఖండిస్తోందని, వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోని, పేద విద్యార్థులకు అవమానించినందుకు ప్రజలకు క్షమాపణ చేయాలని సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గంధమల్ల యాదగిరి డిమాండ్ చేశారు. గరికపాటి నరసింహరావు ప్రవచనాలు, ఆయన ముక్కుసూటితనం, మూఢనమ్మకాలపై చేసిన విమర్శలు, స్త్రీలను తక్కువగా చూసే సంప్రదాయాలను ప్రశ్నించే తీరు, సమాజంలో చైతన్యం కలిగించే ఆయన పాత్రను మేము గుర్తిస్తున్నామన్నారు. అదే వ్యక్తి పేద విద్యార్థుల విషయంలో ఇలాంటి బాధ్యతారాహిత్య వ్యాఖ్యలు చేయడం చాలా బాధాకరమని అన్నారు. గుడ్డును గాడిద గుడ్డుగా సంబోధిస్తూ మధ్యాహ్న భోజన పథకాన్ని ఎగతాళి చేయడం సరికాదని అన్నారు. గుడ్డు తిన్న పిల్లలు సోమరిపోతులు అవుతారు, చదువు తగ్గుతుందని వ్యాఖ్యానించడం పూర్తిగా ఆధారరహితం, బాధ్యతారాహిత్యమని అన్నారు. ప్రజావక్తగా గరికపాటికి ఉన్న బాధ్యత ఎంతో గొప్పదని, వెంటనే తన వ్యాఖ్యలను ఉపసయాహరించుకోవాలని డిమాండ్ చేశారు.

హెచ్ఎంటి కాలని జనరల్ సెక్రెటరీని సన్మానించిన జెఎసి

రామకోటేశ్వర రావును సన్మానిస్తున్న జేఏసీ నాయకులు నల్లరాధా కృష్ణ

నాచారం, మార్చి 23 ప్రభాతవార్త : బ్యాలెట్ పేపర్ ద్వారా ఘనవిజయం సాధించిన హెచ్ఎంటీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ జి రామ్ కోటేశ్వర రావును జేఏసీ నాయకులు సోమవారం నాచారంలో ఘనంగా సన్మానించారు. జేఏసీ సంస్థల వ్యవస్థాపకులు నల్లా రాధా కృష్ణ మాట్లాడుతూ నాచారం ఇంటలెక్చువల్ ఫోరమ్ సభ్యులు విజయం సాధించడం సంతోషకరం అన్నారు. గతంలో మాజీ కౌన్సిలర్ గా, మాజీ అధ్యక్షునిగా వారు చేసిన సేవలకు ఇది నిదర్శనం అన్నారు. 19 ఏప్రిల్ రోజున రామ కోటేశ్వర రావును సుందర్య కేంద్రం లో జరిగే బహుజన సాహిత్య అకాడమీ రాష్ట్ర సదస్సులో ఘనంగా సన్మానించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలలో నల్లా రాధాకృష్ణ, హనుమండ్ల విష్ణు, టేకి రాజశేఖర్, కనుకుంట్ల విజయ్ కుమార్, గద్ద యుగంధర్, మన్నె నరసింహ రెడ్డి, దొప్పా శ్రీను, గుజ్జరి రాజు, తల్లా వెంకటేష్

బండ చంద్రారెడ్డి ముందస్తు హౌస్ అరెస్ట్

ఇంట్లో నుంచి బయటకు వెల్లకుండా బండ చంద్రారెడ్డితో మాట్లాడుతున్న ఏసీపీ జగన్, ఇన్స్‌పెక్టర్ జగన్

తార్నాక, మార్చి 23 ప్రభాతవార్త : కాంగ్రెస్ సర్కార్ వైఖరికి వ్యతిరేకంగా బిజెపి అసెంబ్లీ ముట్టడి కి పిలుపునిచ్చిన నేపథ్యంలో సోమవారం బిజెపి నాయకుడు బండ చంద్రారెడ్డిని తార్నాక లోని ఆయన నివాసంలో ముందస్తుగా ఆయనను హౌస్ అరెస్ట్ చేశారు. ఓయూ ఏసీపి జగన్, ఇన్స్పెక్టర్ మహేష్ కుమార్ గౌడ్ పోలీస్ సిబ్బందితో ఆయన నివాసానికి చేరుకొని హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా బండ చంద్రారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ వైఖరిని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్నింటా విఫలమైన్నారు.కాంగ్రెస్ ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని, ప్రజల నమ్మకాన్ని కోల్పోయిందన్నారు. బీజేపీ నాయకులు ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోలేదని విమర్శించారు.ఇకపై ప్రజా సమస్యలపై బీజేపీ మరింతగా పోరాటం కొనసాగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కొన్నే సంపత్, మల్లి కంటి వీరన్న తదితరులు పాల్గొన్నారు.

కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవస్థానం హుండీల లెక్కింపు



హుండీల లెక్కింపులో పాల్గొన్న ఛైర్మన్, ఈఓ, ధర్మకర్తలు, సిబ్బంది

సైదాబాద్, మార్చి 23 ప్రభాతవార్త: కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవస్థానం హుండీలను సోమవారం లెక్కించారు. హుండీల ద్వారా 145 రోజులకు గాను దేవస్థానానికి రూ.63, 84,446 సమకూరాయి. 67 యుఎస్ డాలర్లు, 5 ఆస్ట్రేలియా డాలర్లు, ఒక మలేషియా రింగిట్, 120 అరబ్ దిర్హామ్స్, 10 యు.కె.పౌండ్స్, 100 బంగ్లాదేశ్ టాకాస్, 20 శ్రీలంక రుపీస్, 50 నేపాల్ రూపీస్ దేవస్థానానికి సమకూరాయి. వెంకట్ ప్రేమ్ కుమార్ రావు పర్యవేక్షణలో కార్యనిర్వాహణాధికారి లావణ్య సమక్షంలో హుండీలను లెక్కించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ ఛైర్మన్ ఈదులకంటి సత్యనారాయణ, ధర్మకర్తలు ఎనుముల రవీందర్‌రెడ్డి, జనుంపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, పూల నాగరాజు, తోకటి కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.